ANN తెలుగు
Follow: @ANNTELUGU
24-03-2025
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 112 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## శ్రీ సీతారామ కళ్యాణంకు రారండి..!

### భద్రాద్రి కళ్యాణ మహోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం

భద్రాచలం అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి
రాములవారి తిరుకల్యాణానికి మహోన్నత ఏర్పాట్లు
ముఖ్యమంత్రితో సమీక్ష

వివరాలు 2లో

టాప్ న్యూస్


### ట్రంప్ మరో బాంబు..5 దేశాల వీసాలు క్యాన్సిల్



- యూనివర్సిటీలపై ఆంక్షల కొరడా
- ఐదున్నర లక్షల వీసాల రద్దు

02

### ఒక్క ఎకరం ఎండినా రాష్ట్ర సర్కార్‌దే బాధ్యత



- ఏప్రిల్ నుంచి ఆరు కేజీల సన్న బియ్యం
- నీటి, పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉండటం నా అదృష్టం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి


03

### మాజీ మంత్రి విడదల రజినీకి బిగ్ షాక్



- బెదిరింపులు, అవినీతి ఆరోపణలపై అభియోగాలు
- ఏసీబీ కేసు నమోదు..
- వైసీపీ కీలకనేతలందరిపైనా వరుసకేసులు

03



# తెలంగాణ ఉద్యమం తరహాలో ప్రత్యేక సౌత్ ఇండియా దేశ ఉద్యమం

### అన్యాయం జరుగుతుంటే చూస్తూ జనం ఊరుకోరు

బీజేపీ తీరుతో దక్షిణాదిలో ప్రత్యేక దేశం డిమాండ్ వచ్చే అవకాశం
తిరుగుబాటు తప్పదు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాట్ కామెంట్స్


**కరీంనగర్, మహా:** దక్షిణాదికి అన్యాయం జరుగుతుంటే.. చూస్తూ ఎవరూ చేతులుముడుచుకు కూర్చోరు. దక్షిణాదిలో ప్రత్యేక దేశం కావాలని ఉద్యమం మొదలయ్యే అవకాశం కూడా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో బిజెపిపై వ్యతిరేకత ఉంది . తెలంగాణ ఉద్యమం తరహాలో దక్షిణాది ఉద్యమం మొదలయ్యే అవకాశం ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాట్ కామెంట్స్ చేశారు. ముందునుండీ కేంద్రంలోని బిజెపికి ప్రాంతీయపార్టీల నుండి వెలుతున్నాయి. ప్రస్తుతం డీలిమిటేషన్ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న వేళ తెలంగాణ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

మిగతా 2లో

# ఆర్టీసీకి మహాలక్ష్మి కళ

## రేవంత్ మార్క్ ట్రీట్‌మెంట్

- రూ.1,008.79 కోట్ల లాభాల దిశగా సంస్థ
- 2024-25లో రూ.709.29కోట్ల లాభం సాధించే అవకాశం
- ప్రయాణికుల సగటు 45.49 నుంచి 59.10 లక్షలకు పెరుగుదల
- నాడు అప్పులకుప్పలు.. నేడు లాభాల ప్రయాణాలు




### గ్యారంటీపై స్పెషల్ ఫోకస్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మక పట్టుదలతో ఆర్టీసి లాభాల పట్టాలపై పరుగులు తీస్తుంది. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసి ఆక్యుపెన్సీ పెరిగి మునుపెన్నడూ లేని రీతిలో రికార్డుస్థాయి లాభాలు కొల్లగొట్టేదిశగా ఆర్టీసి దౌడుతీస్తోంది. రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చిన తర్వాత అప్పుల్లో ఉన్న రోడ్డు రవాణా సంస్థకు భారీ ఆదాయం చేకూరుతున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం అమలుతో గత రెండేళ్లుగా మహిళలకు 'జీరో' టికెట్లు ఇస్తోంది. 2023 డిసెంబరు 9 నుంచి ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా.. వారికి ఛార్జీల మొత్తాన్ని ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లిస్తోంది.

- మహా, హైదరాబాద్


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరుగ్యారెంటీల్లోని మహాలక్ష్మి పథకాన్ని తొట్టతొలిగా ప్రారంభించి, పక్కా ప్రణాళికతో ఆర్టీసికి నష్టం జరగకుండా వ్యూహం రచించారు. ఆ జాగ్రత్తలు, నిరంతర సమీక్షలు ఆర్టీసిని బలోపేతం చేశాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్న సజ్జనార్ ఆర్టీసీ ఎండీగా ఉండడం కూడా కలిసొచ్చింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీపై సమీక్షలు చేయడంతో పాటు క్షేత్రస్థాయి ఫీడ్ బ్యాక్ ను ఎప్పటికపుడు సీఎంకు, ఆర్టీసీ అధికారులకు అందించారు. సీఎం సూచనలు ఇస్తూ, అవసరమైన నిధులు విడుదల చేయిస్తూ ప్రోత్సహించారు. ఫలితంగా తెలంగాణ ఆర్టీసి రికార్డు లాభాల దిశగా పయనిస్తోంది.

వివరాలు 2లో

# బండికే పగ్గాలు

## బీజేపీ రాష్ట్ర సారధిగా ఆయనే

నేడో రేపో అధికారిక ప్రకటన.. ఏకాభిప్రాయానికి వచ్చిన అధిష్టానం
కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు చెక్ పెట్టే వ్యూహంలో సంజయ్ పేరు ఖరారు



**మహా :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మరోసారి బండి సంజయ్ పగ్గాలు చేపట్టబోతున్నారు. దాదాపుగా ఆయన పేరును ఖరారు చేసిన అధిష్టానం నేడో రేపో అధికారంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గడచిన ఆరు మాసాలుగా అధ్యక్ష పదవిపై బీజేపీ తీవ్ర కసరత్తు చేస్తుంది. తెరపైకి ఎందరో నేతల పేర్లు వచ్చినప్పటికీ వారందరి కంటే బండి సంజయ్ ఎక్కువ మార్కులను అగ్రనేతల వద్ద కొట్టేయడంతో ఆయన పేరునే అగ్రనేతలు ఖరారు చేశారు. ప్రస్తుతం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న సంజయ్ రెండు పదవులను ఏకకాలంలో నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మిగతా 2లో

### అక్కడ కేసీఆర్‌కు దొంగనోట్ల ప్రింటింగ్ ప్రెస్ ఉంది

- దొంగనోట్లు పంచే ఎన్నికల్లో గెలిచారు
- కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు

02

### చరిత్ర సృష్టించిన సన్‌రైజర్స్



- రాజస్థాన్‌పై సన్‌రైజర్స్ ఘన విజయం
- ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీ..

08





### యాంకర్ శ్యామలకు కష్ట కాలం

నేడు శ్యామల
రేపు విష్ణుప్రియ విచారణ

02

### ఆదివాసీ మహిళగా ఎన్నో కష్టాలు పడ్డా...



- మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను..
- ప్రస్తుతం తెలంగాణ మంత్రిగా ఉన్నా
- నా ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా..
- దళిత ప్రగతి సదస్సులో మంత్రి సీతక్క ఉద్వేగం
- తిరువనంతపురం వేదికగా రెండ్రోజుల సదస్సు ..
- అణగారిన వర్గాల కష్టాలపై పోరాడుదామని పిలుపు

02

### నేను కేసీఆర్ అంత మంచోడ్ని కాదు



**బరాబర్ మా టైమ్ వస్తది**

- వేధించినోళ్ళు వేరేదేశంలో ఉన్నా లాక్కొస్తాం
- కరీంనగర్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

కరీంనగర్, మహా: కాంగ్రెసోళ్లు ఇందిరమ్మ రాజ్యం తెస్తమని చెప్పినా ప్రజలు ఇందిరమ్మ రాజ్యం గురించి మర్చిపోయి ఓట్లేసింద్రని, ఇందిరమ్మ రాజ్యమంటే

మిగతా 3లో

# శ్రీ సీతారామ కళ్యాణంకు రారండి..!

## భద్రాద్రి కళ్యాణ మహోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం

### భద్రాచలం అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

### రాములవారి తిరుకల్యాణానికి మహోన్నత ఏర్పాట్లు ..సీఎంతో సమీక్ష



**భద్రాచలం మహా:** భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామివారి బ్రహ్మోత్సవాలకు అంగరంగ వైభవంగా ముస్తాబు చేస్తున్న వేళ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో ఆలయ అర్చకులు, అధికారులు కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. భద్రాచల మహాక్షేత్రంలో రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగే తిరుకల్యాణ మహోత్సవం విశిష్టతను వివరిస్తూ, ఈ సాంస్కృతిక ధార్మిక ఉత్సవానికి ముఖ్యమంత్రి ప్రత్యేక హాజరు కావాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులను కూడా అధికారికంగా ఆహ్వానించారు. భద్రాచలం ఆలయ పవిత్రతను, రామాయణ ఇతిహాసంలో దాని స్థానం, శ్రీరామచంద్రస్వామి కళ్యాణోత్సవ మహిమను అర్చకులు వివరించారు.

**శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల ప్రచార పోస్టర్ ఆవిష్కరణ**

ఈ పర్వదిన వేడుకల వైభవాన్ని ప్రచారం చేసేందుకు రూపొందించిన ప్రత్యేక వాల్ పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "భద్రాద్రి రాములవారి కళ్యాణం అనేది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు, ఇది భక్తి, ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాల మహా సంగమం. లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఈ పవిత్ర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ప్రకటించారు.

**సీఎం సమక్షంలో భద్రాద్రి మహోత్సవ ఏర్పాట్ల సమీక్ష**

ఈ సందర్భంగా శ్రీరామనవమి ఉత్సవాలకు భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని, ప్రత్యేక గ్యాలరీలు, తాత్కాలిక వసతి కేంద్రాలు, నీటి సరఫరా పథకాలు, పార్కింగ్ ప్రాంతాల విస్తరణపై సమగ్ర ప్రణాళిక రూపొందించామని అధికారులు వెల్లడించారు. భద్రాచలం బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర మంత్రిమండలి ముఖ్య నేతలంతా హాజరు కానున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన ఘట్టమైన శ్రీరామ కళ్యాణానికి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు హాజరవుతారని, దేవాదాయ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. భద్రాచలం కళ్యాణోత్సవ వైభవాన్ని తిలకించేందుకు లక్షలాది భక్తులు తరలి రానున్న నేపథ్యంలో, ఈసారి బ్రహ్మోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక స్థాయిలో నిర్వహించాలని కసరత్తు చేస్తోంది. భద్రాద్రి భక్తుల తాపత్రయానికి తగినట్టుగా, ఈ ఏడాది రామనవమి వేడుకలు అత్యంత విశిష్టంగా జరగబోతున్నాయి.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

### భద్రాద్రి ఆలయ అభివృద్ధికి సీఎం ప్రత్యేక ఆదేశాలు

భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణ విస్తరణ, రహదారి విస్తరణ, భక్తుల వసతి, నీటి సరఫరా, పార్కింగ్, అన్నదాన సత్రాల ఏర్పాటుపై సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. భద్రాద్రి ఆలయ పరిసరాల్లో అవసరమైన భూసేకరణపై వివరాలను అడిగి తెలుసుకున్న సీఎం, "భద్రాచల రామాలయానికి అపురూపమైన మహిమ ఉంది. భక్తుల కష్టనష్టాలు తొలగించేలా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంది" అని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం పూర్తి స్థాయిలో ప్రణాళిక సిద్ధం చేయాలని, దేవాదాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. భక్తులకు అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

# ఆదివాసీ మహిళగా ఎన్నో కష్టాలు పడ్డా

## మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను

### ప్రస్తుతం తెలంగాణ మంత్రిగా ఉన్నా

### నా ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా

### దళిత ప్రగతి సదస్సులో మంత్రి సీతక్క ఉద్వేగం

### తిరువనంతపురం వేదికగా రెండ్రోజుల సదస్సు

### అణగారిన వర్గాల కష్టాలపై పోరాడుదామని పిలుపు




**తిరువనంతపురం (కేరళ), మహా :** సమాజంలో పేరుకుపోయిన అణచివేతపైన పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని మంత్రి సీతక్క అన్నారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో జరిగిన దళిత ప్రగతి సదస్సులో ప్రసంగించారు. ఈ సదస్సును కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ఆదివారం ప్రారంభించారు. కాగా, హాజరైన మంత్రి సీతక్క ప్రసంగిస్తూ... నమస్కారం కేరళ.. ఈ రోజు మీ ముందు నిలబడి, అణగారిన, బలహీన వర్గాల వాణి వినిపించడానికి గర్విస్తున్నా.. అన్నారు. ఒక ఆదివాసీ మహిళగా అణగారిన వర్గాలు ఎదుర్కొనే కష్టాలు, అన్యాయాలను ప్రత్యక్షంగా ఎదుర్కొన్న తాను, ఈ రోజు మీ ముందు అధికారానికి ఉదాహరణగా నిలబడ్డానని చెప్పారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడమే కాకాకుండా ప్రస్తుతం పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్, మహిళా, స్త్రీసంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నాను.. ఈ ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నట్టు సీతక్క వివరించారు.

**అణచివేతపై ఉద్యమించాలి**

దళితుల హక్కుల కోసం మాట్లాడుతున్న ఈ సమయంలో, మన పోరాటాలు సమానత్వం, సామాజిక న్యాయం మాత్రమే కాకుండా అణచివేత పైన కూడా పోరాడాల్సిన సమయం వచ్చిందని మంత్రి సీతక్క అన్నారు. అదే సమయంలో మనం సాధించిన విజయాల్ని సంబరంగా చేసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఆ విజయాలు ఎంత చిన్నవి అయినా సంబరంగా జరుపుకోవాలని, ఎందుకంటే అమరుల త్యాగాలను, వారు సాధించిన విజయాలను స్మరించాల్సిన అవసరంకూడా ఉందన్నారు. అయ్యంగార్ పోరాటం మొదలు నంగేలీ వరకు ఎన్నో పోరాటాలు చేశారని, వారు భావి తరాల బాగు కోసం పని చేశారని గుర్తు చేశారు. ఈ దేశ దళిత ఆదివాసులుగా, మనకి ఒక గొప్ప ప్రతిఘటన, విప్లవ చరిత్ర ఉందన్నారు. బ్రిటిష్ మొదలు నేటికి మార్పు కోసం చేస్తున్న అస్తిత్వ ఉద్యమాలు అందులో భాగమేనని చెప్పుకొచ్చారు. ఈ చరిత్ర నుంచి మనం స్ఫూర్తి పొంది, సమ సమాజం కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మాన వాళ్ళ చరిత్రలో, దళితులుగా మనం ఎన్నో చీకటి రోజుల్ని చూశాం.. కానీ, ప్రతీసారి ఎదురొడ్డి నిలబడ్డామన్నారు. పోరాట పటిమను ఒకరికొకరు సహాయం చేసుకుంటూ భావి తరాలకు మంచి భవిష్యత్ కోసం పాటుపడదామని సీతక్క పిలుపునిచ్చారు.

# బండికే పగ్గాలు

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవానికి గతంలో సంజయ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసి క్షేత్రస్థాయిలో పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్ళడంలో తనదైన శైలిలో పని చేశారు. పాదయాత్రల ద్వారా ప్రజల దగ్గరకు వెళ్ళిన సంజయ్ యువతను కూడా అదే తరహాలో పార్టీ వైపు ఆకర్షితులను చేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు పార్టీలో అనూహ్యంగా తలెత్తిన పరిణామాలతో ఆయనను పక్కకు జరిపిన అధిష్టానం కేంద్ర మంత్రిగా పని చేస్తున్న కిషన్ రెడ్డికి పగ్గాలను అప్పగించింది. ఇప్పుడు కిషన్ రెడ్డి తరహాలోనే సంజయ్ ను కేంద్ర మంత్రిగా కొనసాగిస్తూనే రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలను అప్పగించాలని కేంద్ర పార్టీ నిర్ణయించింది.

అధికార కాంగ్రెస్ ను ధీటుగా ఢీకొట్టడంతో పాటు బీఆర్ఎస్ ను పూర్తిగా నిర్వీర్యం చేయాలంటే సంజయ్ తోనే సాధ్యమని కేంద్ర పార్టీ భావిస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెదం ిన నేతకు పార్టీ పగ్గాలను అప్పగించడంతో పాటు గత వైభవాన్ని తిరిగి పార్టీకి తీసుకు రావాలంటే సమర్థుడైన నేతకే రాష్ట్ర అధ్యక్ష పీఠం అప్పగిస్తే బాగుంటుందని కేంద్ర నేతలు పలువురు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి అధ్యక్ష పీఠం కోసం పార్టీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావులతో పాటు మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, రామచంద్రారెడ్డి తదితరులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీరందరి పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన అధిష్టానం 2028 ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావాలంటే సంజయ్ లాంటి సాహసోపేత నేత అయితేనే బాగుంటుందని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. తానెప్పుడూ బీజేపీ అధ్యక్ష పదవి అడగలేదని, తాను పోటీలలోనే లేనని సంజయ్ పదే పదే చెబుతున్నప్పటికీ అధిష్టానం ఆలోచన వేరుగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. 2020లో అధ్యక్ష పీఠం చేపట్టిన సంజయ్ మూడేళ్ళ తన పదవీ కాలంలో పార్టీకి జీవం పోశారన్న అభిప్రాయం ఢిల్లీ నేతల్లో వ్యక్తమవుతోంది. ఒక దశలో అప్పటి అధికార బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం బీజేపీయే అన్న రీతిలో ప్రజల్లోకి పార్టీని తీసుకెళ్ళడంలో సంజయ్ తనదైన పాత్రను పోషించారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ పుంజుకుంటున్న నేపథ్యంలో సంజయ్ కు పార్టీ ఫగ్గాలు అప్పగిస్తే తామనుకున్న విధంగా 2028లో అధికారాన్ని చేజిక్కించుకోవచ్చన్న ఉద్దేశ్యంతో సంజయ్ అభ్యర్థిత్వం వైపు అధిష్టానం మొగ్గు చూపినట్లు స్పష్టమవుతోంది.



## తెలంగాణ ఉద్యమం తరహాలో ప్రత్యేక సౌత్ ఇండియా దేశ ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తే దక్షిణాది ప్రత్యేక దేశం కావాలనే డిమాండ్, తిరుగుబాటు తప్పదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ ఆదివారం కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా రజతోత్సవ సన్నాహక ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఇందలో భాగంగా ఏర్పాట్లు చూస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మీడియాతో పలు వ్యాఖ్యలు చేశారు. బీజేపీపై బీసీ రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌కు సంబంధించిన కత్తులు వేలాడుతున్నాయని తెలిపారు. వాటిని సమర్థవంతంగా అమలు చేయకపోతే ముందుంది ముసళ్ల పండుగ అని వ్యాఖ్యానించారు. జనాభా ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై మాట్లాడారు. కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు చిన్నచూపు చూస్తే ప్రత్యేక సౌత్ ఇండియా తిరుగుబాటు తప్పదని అన్నారు. ప్రత్యేక తెలంగాణ తరహాలోనే ఆ డిమాండ్‌ను తోసిపుచ్చలేమని పేర్కొన్నారు.

## యాంకర్ శ్యామలకు కష్ట కాలం

**హైదరాబాద్, మహా :** బెట్టింగ్ యాప్స్ కేసులో విచారణను అధికారులు వేగవంతం చేశారు. ఇప్పటికే విష్ణుప్రియ, రీతూచౌదరిలను విచారించిన పంజాగుట్ట పోలీసులు తర్వాత విచారణలు చేపట్టనున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మార్చి 24న నటి శ్యామల, 25న విష్ణు ప్రియ, రీతూల విచారణ జరగనుంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేసిన 11 మందిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఇప్పటి వరకు టేస్టీ తేజ, కానిస్టేబుల్ కిరణ్, విష్ణు ప్రియ, రీతూ చౌదరిలను పోలీసులు విచారించారు. వీరితో పాటు సన్నీ, అజయ్, సుధీర్ కూడా ఎప్పుడైనా విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే హర్ష సాయి, ఇమ్రాన్ ఇంకా పోలీసులకు అందుబాటులోకి రాలేదని సమాచారం. అటు మియాపూర్ కేసులో మొదట బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు, మధ్యవర్తులను విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేంద్రం తాజాగా 300కు పైగా బెట్టింగ్ యాప్ లను నిషేదించగా, విష్ణుప్రియ 15యాప్ లు ప్రమోషన్ చేసినట్లు తేలింది. విష్ణుప్రియ ద్వారానే మరికొందరు సెలబ్రిటీలు ఈ ప్రమోషన్స్‌లోకి దిగినట్లు తెలుస్తోంది. తర్వాత మరికొందరు సెలబ్రిటీలను కూడా విచారించే అవకాశాలున్నాయి.

# ఆర్టీసీకి మహాలక్ష్మి కళ

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మక పట్టుదలతో ఆర్టీసి లాభాల పట్టాలపై పరుగులు తీస్తుంది. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసి ఆక్యుపెన్సీ పెరిగి మును పెన్నడూ లేని రీతిలో రికార్డుస్థాయి లాభాలు కొల్లగొట్టేదిశగా ఆర్టీసి దౌడుతీస్తోంది. రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చిన తర్వాత అప్పుల్లో ఉన్న రోడ్డు రవాణా సంస్థకు భారీ ఆదాయం చేకూరుతున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం అమలుతో గత రెండేళ్లుగా మహిళలకు 'జీరో' టికెట్లు ఇస్తోంది. 2023 డిసెంబరు 9 నుంచి ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా.. వారికి ఛార్జీల మొత్తాన్ని ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే గత ప్రభుత్వంలో రోజువారీ ప్రయాణికుల సగటు 45.49 లక్షలు ఉండగా మహాలక్ష్మి పథకంతో 59.10 లక్షలు పెరిగినట్లు వెల్లడించారు. దీంతో ఆర్టీసీ గత, ప్రస్తుత ఆర్థిక సంవత్సరాల్లో లాభాలబాట పట్టిందని, 202324 ఆర్థిక సంవత్సరంలో రూ.104.11 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. 202425లో జనవరి నాటికి రూ.529.20 కోట్ల లాభాలు రాగా.. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.709.29 కోట్లు రానున్నట్లు అంచనా వేస్తున్నారు. 202526లో రూ.1,008.79 కోట్ల లాభాలు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

### పొన్నం నిరంతర సమీక్షలు

2025 ఫిబ్రవరి 28 నాటికి సంస్థ చెల్లించాల్సిన బకాయిలు రూ.9,897.55 కోట్లు ఉండగా.. ఇందులో బ్యాంకు రుణాలు రూ.2,719.71 కోట్లు ఉన్నాయి. ఉద్యోగులకు రూ.7,177.84 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆర్టీసీకి రూ.10,327.89 కోట్ల నష్టాల్లో ఉంటే.. ఇపుడు భారీ లాభాల దిశగా పరుగెడుతోంది. ఆర్టీసి పురోగతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతర సమీక్షలు జరపడంతో పాటు తాజా పరిస్థితి, అప్పులపై అసెంబ్లీలో బడ్జెట్ సందర్భంగా జరిగిన చర్చల్లో వివరించారు.




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరుగ్యారెంటీల్లోని మహాలక్ష్మి పథకాన్ని తొట్టతొలిగా ప్రారంభించి, పక్కా ప్రణాళికతో ఆర్టీసికి నష్టం జరగకుండా వ్యూహం రచించారు. ఆ జాగ్రత్తలు, నిరంతర సమీక్షలు ఆర్టీసిని బలోపేతం చేశాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్న సజ్జనార్ ఆర్టీసీ ఎండీగా ఉండడం కూడా కలిసొచ్చింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీపై సమీక్షలు చేయడంతో పాటు క్షేత్రస్థాయి ఫీడ్ బ్యాక్ ను ఎప్పటికపుడు సీఎంకు, ఆర్టీసీ అధికారులకు అందించారు. సీఎం సూచనలు ఇస్తూ, అవసరమైన నిధులు విడుదల చేయిస్తూ ప్రోత్సహించారు. ఫలితంగా తెలంగాణ ఆర్టీసి రికార్డు లాభాల దిశగా పయనిస్తోంది.

## అక్కడ కేసీఆర్‌కు దొంగనోట్ల ప్రింటింగ్ ప్రెస్ ఉంది


### దొంగనోట్లు పంచే ఎన్నికల్లో గెలిచారు

### కేంద్రమంత్రి బండిసంజయ్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బీదర్‌లో దొంగనోట్ల ప్రెస్ ఉందని కేంద్రమంత్రి బండిసంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. అక్కడ ప్రింటింగ్ చేసిన దొంగ నోట్లే ఎన్నికల్లో పంచారని అన్నారు. ఆదివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇటీవల తనకు ఢిల్లీలో ఓ ఎస్పీ కలిసి మాటల సందర్భంలో చెప్పారన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అప్పుల పాలైందని విమర్శించారు. దీనికి కేసీఆర్ మూర్ఖత్వమే కారణమని విమర్శించారు. తెలంగాణకు రూ.6 లక్షల కోట్ల అప్పు ఉందని ప్రభుత్వమే చెబుతోందని అన్నారు. బీఆర్ఎస్ నిర్వాకం వల్ల ప్రభుత్వ భూములు అమ్మితే గాని ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. కమీషన్లు ఇచ్చేవారికే బిల్లులు చెల్లిస్తున్నారు.. ఆ కమీషన్లు 15 నుంచి 18 శాతానికి పెంచారని ఆరోపించారు. ఎన్నికల్లో ఉద్యోగులకు కాంగ్రెస్ అనేక హామీలిచ్చింది.. ఉద్యోగులకు ఇచ్చిన హామీలకు రూ.8 వేల కోట్లు కావాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ విధానాలు చూస్తుంటే మరో మూడు నెలల తర్వాత జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలుచేయకుండా మోసం చేస్తే పుట్టగతులుండవని హెచ్చరించారు. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డట్లు చరిత్రలో లేదన్నారు. రైతులు తలుచుకుంటే ప్రభుత్వాలను మార్చేయగలరన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌పీవో వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## ట్రంప్ మరో బాంబు.. 5 దేశాల వీసాలు క్యాన్సిల్

### యూనివర్సిటీలపై ఆంక్షల కొరడా.. ఐదున్నర లక్షల వీసాల రద్దు



**మహా:** అక్రమ దేశాలపైనే కాదు.. గిట్టని దేశాలపైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్కు పాదం మోపుతున్నారు. నాలుగు దేశాలకు చెందిన దాదాపు ఐదున్నర లక్షల మంది వీసాలను రద్దు చేశారు. అటు యూనివర్సిటీలపై ఆంక్షల కొరడా ఝుళిపిస్తున్నారు. దీంతో విద్యార్థులు భయం భయంగా గడుపుతోన్నారు. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపి.. వారిని స్వదేశాలకు పంపుతోన్న అమెరికా.. ఇప్పుడు తాత్కాలిక వలసదారులను ఇంటికి పంపిస్తోంది. అక్రమ దేశాలపైనే కాదు.. గిట్టని దేశాలపైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్కు పాదం మోపుతున్నారు. నాలుగు దేశాలకు చెందిన దాదాపు ఐదున్నర లక్షల మంది వీసాలను రద్దు చేశారు. అటు యూనివర్సిటీలపై ఆంక్షల కొరడా ఝుళిపిస్తున్నారు. దీంతో విద్యార్థులు భయం భయంగా గడుపుతోన్నారు. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపి.. వారిని స్వదేశాలకు పంపుతోన్న అమెరికా.. ఇప్పుడు తాత్కాలిక వలసదారులను ఇంటికి పంపిస్తోంది. చట్టపరమైన నివాస హోదా రద్దు చేయాలని నిర్ణయించింది. లాటిన్ అమెరికా నాలుగుదేశాలకు చెందిన ఐదున్నర లక్షల మందికి.. వారి వారి స్వదేశాలకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. క్యూబా, హైతీ,నికరాగువా, వెనెజువెలా దేశాల వలసదారుల తాత్కాలిక రక్షణను రద్దు చేస్తున్నట్లు హోమ్ లాండ్ సెక్యూరిటీ విభాగం స్పష్టం చేసింది.

# నేను కేసీఆర్ అంత మంచోడ్ని కాదు



(మొదటిపేజీ తరువాయి)

ఎమర్జెన్సీ రాజ్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం కరీంనగర్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎమర్జెన్సీ రాజ్యమే నడుస్తోందని, సోషల్ మీడియాలో ఒక పోస్టుపెడితే పోలీసోడు ఫోన్ చేస్తున్నడని చెప్పారు. పోలీసోడు దొంగలవట్టుడు విడిచిపెట్టిండని, బీఆర్ఎస్ వాళ్ల వెంబడి పడుడే నేర్చుకున్నడని ఎద్దేవా చేశారు. తాను మీ అందరికి ఒక్కటే మాట ఇస్తున్నానని, తాను కేసీఆర్ అంత మంచివాన్ని కానని, మళ్ల మన టైమ్ వస్తదని, బరాబర్ మన టైమ్ వస్తదని, వేధించేటోళ్ల పేర్లు రాసి పెట్టుండ్రని, అధికారంలోకి వచ్చినంక ఒక్కొక్కన్ని ఏంజేయాలో అది జేద్దామని అన్నారు. వదిలిపెట్టే సమస్యే లేదని చెప్పారు. 'కొంతమంది మేం రిటైరైతం, ఇంటికి పోతం ఏంజేస్తరని అనుకుంటున్నరమో.. రిటైరైనా వేరే దేశానికి పోయినా రప్పించి అన్ని లెక్కలు సెటిల్ జేస్తం. కితాబ్ మొత్తం చూస్తం.' అని హెచ్చరించారు. 'కేంద్రం డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తోంది. జనాభా ధామాషా పద్ధతిలో నియోజకవర్గాల పునర్విభజన చేస్తామని అంటోంది. అంటే ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో ఎంపీ సీట్లను పెంచి, తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో ఎంపీ సీట్లను తగ్గిస్తమంటోంది. నాడు భారత ప్రభుత్వం జనాభా నియంత్రణ కోసం కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేస్తే.. దక్షిణాది రాష్ట్రాలు పాటించినయ్. ఈ రాష్ట్రాలతోపాటు ఒడిశా, పంజాబ్, పశ్చిమబెంగాల్ లాంటి కొన్ని ప్రగతిశీల రాష్ట్రాలు కూడా కేంద్ర ప్రభుత్వం మాట విన్నయ్. కానీ ఇప్పుడు కేంద్రం ఏంచేస్తనంటుంది. తన మాట విన్న రాష్ట్రాలకు అన్యాయం చేసి, మాట వినని యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు మేలు చేస్తనంటోంది. ఇదెక్కడి న్యాయం. అందుకే నిన్న తమిళనాడు ఎంకే స్టాలిన్ నేతృత్వంలో సమావేశమైనం. కేంద్రం పోకడను అడ్డుకోవాలని నిర్ణయించినం.' అని కేటీఆర్ చెప్పారు.

# ఒక్క ఎకరం ఎండినా రాష్ట్ర సర్కార్‌దే బాధ్యత

## ఏప్రిల్ నుంచి ఆరు కేజీల సన్న బియ్యం

### నీటి, పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉండటం నా అదృష్టం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి





**హైదరాబాద్:** సన్న బియ్యం పంపిణీపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. మార్చి 30వ తేదీన హుజూర్ నగర్ పట్టణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమం సీఎం చేతుల మీదుగా జరుగుతుందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. రాష్ట్రంలో ఏప్రిల్ నెల నుంచి రేషన్ కార్డు ఉన్న వాళ్ళకు ఆరు కేజీలు సన్న బియ్యం అందిస్తామని ప్రకటించారు. తెలంగాణలో 84 శాతం మందికి సన్న బియ్యం అందుతాయని ఆయన వెల్లడించారు. దొడ్డు బియ్యం ఇవ్వడం వల్ల పేదలు తినకుండా అమ్ముకున్నారని చెప్పారు. నీటి, పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నానని ఉత్తమ్ తెలిపారు. కృష్ణా జలాల్లో కొంచెం నీటి కొరత ఉండటం వాస్తవమేనని, శ్రీశైలం నుంచి కరెంట్ తయారుకు నీటిని విడుదల చేసి వాటిని సాగర్ ప్రాజెక్ట్‌లోకి విడుదల చేస్తామని ప్రకటించారు. దీని వల్ల కొంత నీటి కొరత తగ్గుతుందని, ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఉన్న ప్రాజెక్టులు అన్నీ పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

**ప్రాజెక్టుల కింద ఎండితే సర్కారుదే బాధ్యత**

రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల కింద ఒక్క ఎకరం ఎండినా రాష్ట్ర సర్కార్‌దే బాధ్యత అని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బోర్ల కింద పంటలు ఎండితే మాత్రం ప్రభుత్వానికి సంబంధం లేదని చెప్పారు. ఈ ఎండా కాలంలో వరి ఎంత వేయాలో రైతులకు తెలుసని చెప్పారు. ప్రాజెక్టుల కింద వరి పంటలకు సాగు నీరు అందేలా చూసేందుకు వారానికోసారి సమీక్ష చేస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీమంత్రి జానారెడ్డి పాల్గొన్నారు.

# మాజీ మంత్రి విడదల రజినీకి బిగ్ షాక్

## బెదిరింపులు, అవినీతి ఆరోపణలపై అభియోగాలు

### ఏసీబీ కేసు నమోదు.. వైసీపీ కీలకనేతలందరిపైనా వరుసకేసులు



**మహా:** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ నేతలపై వరుస కేసులు నమోదవుతున్నాయి.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు మొదలుకొని.. సోషల్ మీడియా పోస్టుల వరకు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ కేసులు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు విడదల రజినీకి బిగ్ షాక్ తగిలింది. రజినీతో పాటు పలువురిపై కేసు నమోదు చేశారు ఏసీబీ అధికారులు. అవినీతి ఆరోపణలు, బెదిరింపులు తదితర అభియోగాలపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది. అవినీతి నిరోధక చట్టంలోని 7, 7ఎ, ఐపీసీ 384, 120బి, సెక్షన్ల ప్రకారం ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు . 2020 సెప్టెంబర్ లో పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం విశ్వనాథుని కండ్రిక గ్రామంలోని శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్ యజమానిని విజిలెన్స్ తనిఖీల పేరుతో బెదిరించి రూ.2.20 కోట్లు అక్రమంగా వసూలు చేశారనే అభియోగంపై విడదల రజిని మీద కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులో విడుదల రజనీని ఏ1 నిందితురాలిగా చేర్చారు అధికారులు. ఏ2గా ఐపీఎస్ అధికారి పల్లె జాషువా, ఏ3గా విడుదల రజిని మరిది విడుదల గోపి, ఏ4గా రజిని పీఏ రామకృష్ణలను నిందితులుగా చేర్చినట్లు అధికారులు తెలిపారు .

# పంట పొలాల్లోకి.. ఆర్టీసి బస్సెక్కి.. సైకిల్ తొక్కి..

# కలెక్టర్లా.. కామన్ మ్యాన్లా..

## మార్పుకు అంబాసిడర్లు.. జనంతో మమేకమవుతున్న జిల్లా కలెక్టర్లు

## ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛతో.. ప్రజల హృదయాల్లో ముద్ర వేసే యత్నం





**మహా నెట్ వర్క్:** కలెక్టర్లు అంటే.. బంగళాకే పరిమితమయ్యే ఉద్యోగం కాదు. జనంతో ఉండాలి. జనం బాధలు తెలుసుకోవాలి. సంక్షేమం చూడాలి. చదువు తీరు కనిపెట్టాలి. పథకాల అమలుకు వారిదే భారం. సంక్షేమానికి సాయానికి వారే ప్రభుత్వ కళ్ళు. తెలంగాణ ప్రభుత్వంలో .. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లా కలెక్టర్లు కూడా తమ మార్క్ చూపిస్తున్నారు. అదిదా..సార్ అన్నట్లు మార్పుకు అంబాసిండర్లుగా కనబడుతున్నారు. ఓ జిల్లా కలెక్టర్ తెల్లవారుజామున నాలుగుగంటలకే ఓ పేదింటి విద్యార్థి తలుపుతట్టి చదువుతున్నాడా లేదా పరీక్షించి చదువు ప్రాధాన్యత చెప్పగా, మరో కలెక్టర్ సైకిల్ మీద, ఆర్టీసీ బస్సుల్లో తిరుగుతూ ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని, కోరికలను తెలుసుకుంటున్నారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యల పరిశీలనకు కొందరు, రోడ్డులేని ప్రాంతాలకు కూడా కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్ళి సమస్యల మూలాలు పడుతున్న మరికొందరు.. మొత్తంగా తెలంగాణలోని పలువురు జిల్లా కలెక్టర్ తమ ముద్ర బలంగా వేస్తున్నారు. మార్క్ చూపిస్తున్నారు. సమస్య ఉందని వినతి పత్రాలు తీసుకునే వచ్చే ప్రజల సమస్యలు ఓపిగ్గా విని.. వికలాంగులు ఉంటే.. నేలపై కూర్చొని వారి సమస్యలు వింటారు. హాస్టల్స్, అంగన్‌వాడి సెంటర్, స్కూల్స్ సందర్శించి పిల్లలతో మమేకమవుతారు.. స్టూడెంట్‌గా పాఠాలు వింటారు. ఉపాధ్యాయుడు పాత్రలో వారికి పాఠాలు బోధిస్తారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి వాటిని పరిష్కరిస్తున్నారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, యాదాద్రి కలెక్టర్ హన్మంతరావు, మెదక్ కలెక్టర్ రోహిత్ రాజ్ ఇలా పలువురు కలెక్టర్లు వినూత్న కార్యక్రమాలతో సేవకు మారుపేరుగా నిలుస్తున్నారు.

**సింపుల్ గా బస్సులో..**

చిన్న ప్రభుత్వ ఉద్యోగం రాగానే కొంతమంది దర్పం ప్రదర్శిస్తుంటారు. కానీ ఎప్పుడు బిజీగా ఉండే ఓ జిల్లా కలెక్టర్.. తన సింప్లిసిటీ అంటే ఏంటో చూపించాడు. తన భార్యతో కలిసి ఒకటి కాదు రెండు 20 కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కారు. మెదక్ నుండి రామయంపేట వరకు సైకిల్ తొక్కుతూ వెళ్లారు. రిటర్న్‌లో సాధారణ వ్యక్తిలాగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మెదక్ జిల్లా రామాయంపేటలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా పర్యటించారు. ఆదివారం ఉదయం మెదక్ జిల్లా కేంద్రం నుండి 20 కిలోమీటర్ల మేర సైకిల్ పై ప్రయాణం చేసిన కలెక్టర్ రామయంపేట ఆర్టీసీ బస్టాండ్ ను సందర్శించారు. మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలించి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్టీసీ బస్సులో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు జిల్లా కలెక్టర్ రాహుల్. తిరిగి మెదక్‌కు సామాన్య ప్రయాణికుడి లాగా తన భార్యతో కలిసి ఆయన ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసి మెదక్ వెళ్లారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందున మహిళలు 70శాతం మేర ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారని తెలిపారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఏది ఏమైనా ఓ జిల్లా కలెక్టర్ ఇలా సైకిల్ పై రావడం.. మళ్ళీ బస్సులో అందరితో కలిసి సింపుల్ గా వెళ్లడం చూసి అందరూ షాక్ అయ్యారు.

**ఖమ్మంలో ఆడపిల్లకు స్వీట్ బాక్స్**

వినూత్న కార్యక్రమాలకు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెట్టిందిపేరు. ఆయన పొలం గట్లమీద తిరిగి రైతు సమస్యలు తెలుసుకుంటారు. పాఠశాలకు వెళ్ళి విద్యార్థిలా మారిపోతారు. వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరించడమే కాకుండా చదువువిలువ చెబుతారు. ఎవరూ వెళ్ళలేని ప్రాంతాలకు వెళ్ళి.. టూరిజాన్ని కొత్త పుంతలు తొక్కించే ప్రణాళికలు రచిస్తారు. ఆడపిల్ల పుట్టిందని తల్లిదండ్రులు ఆ శిశువును ప్రసవించిన ఆసుపత్రిలో వదిలి వెళ్లిన ఘటనలు ఎన్నో చూశాము. ఆడ పిల్ల పుట్టిందని వదిలి వెళ్లిన ఘటనలు ఖమ్మం నగరంలో గతంలో జరిగింది. తల్లి వదిలి వెళ్లగా పాల కోసం ఆ చిన్నారి గుక్క పట్టి ఏడుస్తుంటే గమనించిన ఆసుపత్రి నర్సులు ఆ శిశువును ఖమ్మంలోని శిశుగృహానికి తరలించారు. ఇలాంటి ఘటనలు ఖమ్మం జిల్లా లోనే పలు ప్రాంతాల్లో జరుగుతున్న నేపథ్యంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'గర్ల్ ప్రైడ్' పేరిట ఓ సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఖమ్మం జిల్లాలో ఆడపిల్లల పుట్టిన ఇంటికి జిల్లా అధికారులు వెళ్లి వారింట్లో మిఠాయి బాక్సు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్. తాజాగా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆడపిల్ల ఇంటికి లక్ష్మి అని అమ్మాయి పుట్టడం శుభ సూచకమని ప్రజల్లో ప్రచారం చేసేందుకు తాను ఈ పథకాన్ని ప్రారంభించానని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. వచ్చే వారం నుంచి ఈ గర్ల్ ప్రైడ్ కార్యక్రమం కోసం జిల్లా అధికారుల పర్యటనలను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఆడపిల్ల జన్మించడం ఆ తల్లిదండ్రులకు గర్వకారణంగా భావించేలా కలెక్టరు స్వీట్ బాక్సును అధికారులతో వారి ఇళ్లకు పంపించడానికి చర్యలు తీసుకున్నారు. ఆడపిల్ల పుడితే సమాజంలో ఉన్న పక్షపాతం పోగొట్టే సంస్కృతిని పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చెప్పారు. ఆడపిల్లల ప్రాముఖ్యతను ప్రోత్సహించడంతో పాటు సామాజిక దృక్పథాన్ని మార్చడానికి తాను ఈ కొత్త కార్యక్రమాన్ని అమలు చేస్తున్నానని అన్నారు.

# కృతజ్ఞతా మార్చ్

## ఇందిరాపార్క్ వద్ద మోత రోహిత్ ఆధ్వర్యంలో భారీ ఫ్లెక్సీ

**హైదరాబాద్, మహా:** బీసీలకు 42 శాతం రిజ్వర్వేషన్, ఎస్సీ వర్గీకరణ, రాజీవ్ యువ వికాసం వంటి నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ.. హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మోత రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం కృతజ్ఞత మార్చ్ నిర్వహించారు. సచివాలయం వద్దనున్న రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు చేపట్టిన ర్యాలీ చెపట్టారు. ఇందిరా పార్కు వద్ద థ్యాంక్యూ రేవంత్ అన్నా అని ప్రచురించిన 40 అడుగుల ఫ్లెక్సీని డ్రోన్ల సహాయంతో ఎగరేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా రోహిత్ ముదిరాజ్ మాట్లాడుతూ దేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును పాస్ చేయించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని, అది కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి 42 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చారని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పేరుతో రూ. 4 లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయమందించి స్వయం ఉపాధి కల్పన దిశగా ప్రోత్సహిస్తున్నారని అన్నారు.



# రాష్ట్రాలతో చర్చించాకే డీలిమిటేషన్‌పై ముందుకెళ్లాలి

## ప్రభుత్వ సలహాదారు కేకే

**హైదరాబాద్, మహా:** రాష్ట్రాలతో చర్చించాకే కేంద్రం డీలిమిటేషన్‌పై ముందుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్‌లో చట్టం ఆమోదం పొందాకే కేంద్రం డీలిమిటేషన్ చేయాలన్నారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం ఇంకా పెరగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. కొన్ని రాష్ట్రాలు సీట్లు గురించి కాకుండా.. పార్లమెంటులో తమ గళానికి ప్రాధాన్యత ఉండాలని అంటున్నాయని కేకే అన్నారు.

# బీఆర్ఎస్ వాకౌట్ చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు

## సీజన్ కో మాట చెప్పి.. రైతులను మోసం చేసింది మీరు

### చెప్పింది చేసిన ఘనత.. కాంగ్రెస్ ప్రభుత్వానిదే.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేకున్న రైతులకు ఇచ్చిన హామీ మేరకు, దేశ చరిత్రలో ఎవరూ చేయనివి సాహసోపేత నిర్ణయం తీసుకొని, ఏకకాలంలో 2 లక్షల వరకు ఉన్న పంట రుణాలను రుణమాఫీ చేశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. బీఆర్ఎస్‌నేతలు ప్రభుత్వం రుణమాఫీ చేయలేదనే విమర్శలకు దీటుగా కౌంటర్ ఇచ్చారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూ.20,616.89 కోట్లు రుణమాఫీ చేసి, 25,35,964 మంది రైతులను రుణ విముక్తులని చేసి, రైతుల పట్ల మా నిబద్ధతను చాటుకున్నామని తెలిపారు.

మొదటి మూడు విడతలలో రుణమాఫీకి నోచుకోని అర్హులైన రైతులను ఈ పథకం కిందకి తీసుకొచ్చే విధంగా ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసి, మూడు నెలల పాటు అధికారులు ఇంటింటికి తిరిగి సమాచారం సేకరించి, చివరి విడతలో 3,13,896 మంది రైతులకు రూ. 2747.67 కోట్లు రుణమాఫీ చేసినట్లు చెప్పారు. 2014 రుణమాఫీ లో లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చి, నాలుగు సంవత్సరాల సమయం తీసుకుని విడతల వారిగా జమ చేయడంతో రైతులపై రూ. 2630 కోట్లు అధిక వడ్డీ భారం పడిందన్నారు. గత ప్రభుత్వం 2014, 2018 లో రుణమాఫీ అమలు చేసిన విధానం ఏ విధంగా చేయకూడదో తెలియజేస్తే, మా ప్రభుత్వం 2024 లో రుణమాఫీ పథకం అమలు చేసిన తీరు భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలకు ఒక దిక్సూచిగా నిలిచిందన్నారు. పథకాన్ని అమలు చేయలేక రెండు పర్యాయాలు చేతులెత్తేసిన బీఆర్ఎస్, రేవంత్ సర్కార్ ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. రైతుబంధు పేరిట అన్ని పథకాలకు తిలోధకాలు ఇచ్చి మాకు నీతులు చెప్పడం హాస్యస్పదంగా ఉందని, రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలుతో పాటు సన్న వడ్లకు బోనస్, వ్యవసాయ యాంత్రీకరణ, మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. పంట నష్ట పరిహారం ఎగ్గొట్టి, రైతుల ఉసురు పోసుకున్న గత పాలకులు వచ్చిన మొదటి సంవత్సరంలో ఏ ఒక్క రైతు ప్రకృతి వైపరిత్యంతో నష్టపోవద్దని ఎకరానికి రూ. 10 వేల చొప్పున పరిహారం అందించామన్నారు.

## వరి వేస్తే ఉరన్నారు.. సీజన్ కో మాట చెప్పారు

వరి వేస్తే ఉరి, మొక్కజొన్న వద్దు, పత్తి సాగు వద్దని, సన్నాలు సాగు చేయమని సీజన్‌కో మాట చెప్పి, తీరా పంటలు చేతికొచ్చాక, రైతులను పట్టించుకోకుండా వదిలేసిన ఘనత బీఆర్ఎస్ పాలకులదేనన్నారు. ఈ విధంగానే భవిష్యత్తులో కూడా ఇష్టారీతిన మాట్లాడితే, వాకౌట్ చేయడం కాదు, ప్రజాక్షేత్రం నుండి ప్రజలే తరిమికొడుతారని హెచ్చరించారు. భవిష్యత్ కాలంలో రాష్ట్రంలో వ్యవసాయ పురోగతికి కావాల్సిన చర్యలు తీసుకొని రైతుల అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# రేషన్ కార్డు ఉంటేనే రాజీవ్ యువ వికాసం స్కీం వర్తింపా..?

## కొత్త రేషన్ కార్డుల కోసం పాత కార్డులు డిలీట్ చేసుకున్న లబ్ధిదారులు

### ఎలక్షన్ కోడ్ తరువాత వారంలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామనడంతో పాతవి డిలీట్

### ఉపాధి స్కీం కు అనర్హులుగా రేషన్ కార్డులు లేని వారు

### ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



**ములుగు, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాసం స్కీంకు రేషన్ కార్డు జారీ తలనొప్పిగా మారింది. ఉపాధి అవకాశాలను కల్పించేందుకు 5లక్షల మందికి రూ.1లక్ష నుంచి రూ.4లక్షల వరకు ప్రభుత్వం నాలుగు రకాల సబ్సిడీ రూపంలో పథకాన్ని రూపొందించి జీవో విడుదల చేసింది. అర్హులైన లబ్ధిదారులను ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు. ఏడు విభాగాల్లో ఎంచుకున్న సబ్ స్కీంలకు రుణాలు మంజూరు చేయనున్నారు. పేరు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు నెంబర్లను జత చేయాల్సి ఉంటుంది. రేషన్ కార్డు లేని వారికి ఈ స్కీం వర్తించదు. దీంతో లబ్ధిదరులకు కొత్త తలనొప్పి వచ్చింది. ఎంతో మంది నిరుద్యోగ యువత ఏదో ఒక ఉపాధి అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి ఆన్లైన్ సెంటర్లు, మీసేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు.

**రేషన్ కార్డుల లేకుంటే రాజీవ్ యువ వికాసం లేనట్లే..**

రాజీవ్ యువ వికాసం స్కీం ద్వారా అర్హులైన లబ్ధిదారులు ఆన్ లైన్ చేసుకోవాలంటే రేషన్ కార్డులు తప్పనిసరిగా చూపిస్తోంది. ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు రేషన్ కార్డు నెంబరును తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఆధార్ కార్డులకు రేషన్ కార్డులను అనుసంధానం చేసిన ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం స్కీంలో ఆధార్ నెంబరును నమోదు చేయడంతో ఒకవేళ రేషన్ కార్డు లేకుంటే స్కీం కు వర్తించరు అని చూపిస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం కొత్త రేషన్ కార్డులు వస్తాయనే ఆశాభావంతో పెళ్లి అయిన జంటలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొందరు తల్లిదండ్రుల నుంచి విడిగా రేషన్ కార్డు కోసం అప్లై చేసుకున్నారు. అయితే ఆన్లైన్, మీసేవా నిర్వాహకులు పాతవాటిలో పేర్లు డిలీట్ చేస్తేనే కొత్త వాటికి పేర్లు నమోదు అవుతాయని చెప్పడంతో తమ పేర్లను రిమూవ్ చేసుకొని కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కొత్త రేషన్ కార్డులను ఇవ్వకపోవడంతో రాజీవ్ యువ వికాసం స్కీంకు కొందరు అర్హులైన నిరుద్యోగులు కూడా అనర్హులుగా ప్రకటించబడుతున్నారు. ప్రభుత్వ తీరుపై యువత అసహనం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా రేషన్ కార్డు లింకేజీ తొలగించాలని, లేనిపక్షంలో వెంటనే కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఏడు విభాగాల్లో రాజీవ్ యువ వికాసం లోన్లు..**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టింది. అందులో అగ్రికల్చర్, ఆగ్రో బేస్డ్, యానిమల్ హస్బండరీ, హార్టీకల్చర్, ఇండస్ట్రియల్ సర్వీస్ బిసినెస్, మైనర్ ఇరిగేషన్, ట్రాన్స్ పోర్ట్ సెక్టార్ లలో ఒక్కో విభాగంలో సబ్ కేటగిరీలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఎంపిక చేసుకున్న విభాగాలను బట్టి లోన్ ఇస్తారు. బ్యాంకు లింకేజీ ద్వారా లోన్లు ఇస్తూ 80శాతం వరకు సబ్సిడీ కూడా అందుబాటులో ఉంది. దీంతో నిరుద్యోగ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడానికి క్యూలు కడుతున్నారు. అయితే రేషన్ కార్డు ఉన్నవారికే ఈ పథకం వర్తిస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. తెలంగాణ ప్రభుత్వం పునరాలోచించి రేషన్ కార్డు నిబంధన తొలగించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# ఎలుక చేయి


- కోడూరి విజయకుమార్

పనిగంటల వేళ ఆఫీసు కుర్చీలో కూర్చోగానే
టేబుల్ సొరుగు సందులో యిరుక్కొని
పసిపాప చేతివేళ్లను తలపిస్తూ
లేత గులాబీ రంగులో ఎలుక చేయి
గగుర్పాటు కొన్ని క్షణాల పాటు
దేహంలో ఎలుకలా గజిబిజిగా తిరుగుతూ

ఏ రాత్రి సమయాన ఈ చిట్టెలుక చేరి వుంటుంది?
లేక, ఏ పగటిపూట నిశబ్దంగా చొరబడి వుంటుంది?
లేక ఏ ఆకలి తరిమితే
ఈ సొరుగు లోకి చేరి వుంటుంది?
ఆకలి తీర్చుకొనే క్రమంలో ఈ ఎలుక
లోనికి వచ్చిన దారి మరిచి వుంటుంది

ఇక లోపల వుండలేని ఉక్కిరిబిక్కిరి సమయాన
శక్తినంతా కూడదీసుకుని సొరుగు సందులోంచి
బయటపడాలని ప్రయత్నించి వుంటుంది
పాపంఎలుక మొత్తం ఒక చేయిగా మారిపోయి
నిస్సహాయంగా బయట వేలాడుతూ
ముక్కుపుటాలను పరీక్షించుకున్నాను
సొరుగులో ఎలుక మరణించి వుంటుందా?
చేయిని విసర్జించి మరో దారిలో పారిపోయి వుంటుందా?
వాసనలో తేడా తెలియలేదు
లేక, చచ్చిన ఎలుకల వాసన అలవాటై పోయిందా?

సొరుగు తెరిచి చూద్దామని ప్రయత్నించాను
ధైర్యము విలోమంబై వెనకడుగు వేసాను

ధైర్యమే మనిషి అయిన వాడొకడు ప్రవేశించి
నన్ను గది బయటకు పంపించి
ఎలుకను గాలించే పనిలో పడ్డాడు
కొంత సమయం తరువాత బయటకు వచ్చిన మనిషి
'తలుపు తెరువగానే ఎలుక పారిపోయింది' అన్నాడు

తిరిగి కుర్చీలో కూర్చుని సొరుగు వైపు చూసాను
ఎలుక చేయిని గుర్తు చేస్తూ ఎర్రని మరక
తెగిన చేయిని ఎలుక వదిలేసి వెళ్లి వుంటుందా?
లేక, వేలాడే చేయితోనే పారిపోయి వుంటుందా?
ఆ మనిషికి నిజంగా ఎలుక కనిపించి వుంటుందా?
లేక, అతడు నాకొక ఎలుక కథ వినిపించి వుంటాడా?

## మెరమెర

నిప్పుకణికను కప్పింది
ఆభిజాత్యపు బూడిద.
కృతజ్ఞత ఆవిరి!

నిగ్రహ వాక్యానికి
చెదపురుగు పట్టింది
సహనం గంగాసమర్పయామి

దేవుడా! మాటలు లేకుండా
మనసును వ్యక్తం చేసే
మార్గం చూపించు

## తారక మంత్రం

నువ్వు సెగలు గక్కినప్పుడు
నేను మంచుసోన కావడం,
నేను ముళ్లపొద ఐనప్పుడు
నువ్వు పూలచెండుగా మారడం!
ఇంత మంచి తారక మంత్రాన్ని
మించినదేముంది ఈ లోకంలో?


- ఎలనాగ

# నా పఠనా స్థలాలు – సాహిత్య పాఠ్యపుస్తకాలు

**దేశంలో అత్యవసర పరిస్థితి తర్వాత ఒక సామాజిక బాధ్యత ఉన్న కవిగా రచయితగా కన్ను తెరిచిన వాడిని నేను. నేను సిరిసిల్ల పౌర గ్రంథాలయం మరియు సినారే అంతేవాసి హనుమాజిపేట నివాసి కనపర్తి సార్ యొక్క ఇంటి గ్రంథాలు మరియు జక్కని వెంకట రాజం సార్ తెప్పించే నెలనెలా వార ప్రత్యేక సంచికలు నా పఠనా స్థలాలు. అంతే కాకుండా మిక్కిలి ప్రభావితం చేసిన నిజాం వెంకటేశం సార్ సిరిసిల్లకు వచ్చినప్పుడల్లా తెచ్చి ఇచ్చే అప్పటికే పేరు ప్రఖ్యాతి గల కవులు రచయితల పుస్తకాలు ఇలా ఎన్నెన్నో గ్రంథాలు చదివిన సోయితో నేను కవిగా రచయితగా గత ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్నాను.**

నేను సాహిత్య జిజ్ఞాసతో రోజు పొద్దున్న పనికి పోయి వచ్చి సాయంత్రం పుస్తకం తెచ్చుకొని మా మానేరు వాగులో చదివే వాడిని. నాకన్నా ముందు తరాలు విద్యార్థులకు మా ఊరిలో గౌరవనీయులు సన్నిహితులు వైద్య ఉమాశంకర్ వకీల్ గారి బంగ్లా నా పఠనా స్థలాలుగా ఉండేది. నాతోపాటు అనేకమంది విద్యార్థుల యొక్క వారి వారి అభిరుచుల మేరకు వ్యక్తిత్వ వికాసం స్పష్టంగా రూపుదిద్దుకోవడానికి ఆలవాలంగా ఒక విధంగా సరస్వతి నిలయంగా ఎల్లవేళలా బాసించేది. అలాగే బీజ ప్రాయంలో ఉన్న జిజ్ఞాసను ,నన్నూ సాహిత్య కారునిగా తీర్చిదిద్దినది మా తంగళ్ళపల్లి లో విభిన్నంగా విలక్షణంగా ఒక ఈఫిల్ టవర్ గా ఉండే లంకంత ఎత్తైన రెండు అంతస్తుల బంగ్లా అది. వాళ్ల తండ్రి వీరప్ప వకీల్ ఆరోజుల్లో మూడు రెవెన్యూ చట్టాల గ్రంథాలు రచించారు. అయన రాసిన రెవిన్యూ గ్రంథాలు ఆ కాలంలో తయారైన రెవెన్యూ చట్టాలలో జమాబందిగా ప్రక్షిప్తతం చేయబడడమే కాకుండా అనేక ముఖ్య విషయాలను అట్టి చట్టంలో ప్రముఖంగా పొందుపరిచారు. పిదప కాలంలో వీరప్ప వకీల్ ఎల్లారెడ్డిపేట మక్తా తహసిల్దారుగా పనిచేశారు. ఏకైక కొడుకు ఉమాశంకర్ గారి అమ్మ బుచ్చమ్మను బంగ్లమ్మ అని అందరూ పిలిచేవారు.ఉమాశంకర్ లాయర్ గారి శ్రీమతి భారతమ్మ ఊరందరూ చిన్నమ్మ అని సంభోదించేవారు. ప్రతి సంవత్సరం రాసే మా ఉమాశంకర్ గారి డైరీలు ఆనాటి మా ఊరి సమకాలీన సమాజం యొక్క ఆర్థిక రాజకీయ కుటుంబ సంబంధాలను గురించి నమోదు చేసేవారు. అందుబాటులో ఆ డైరీలు అందుబాటులో ఉంటే వాటిలోని ముఖ్యమైన అధ్యాయాలను ఎంపిక చేసి అచ్చు వేస్తే మిక్కిలి ప్రభావంతంగా ఉంటుంది. వారి కుమారులకు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ సూచన చేస్తున్నాను.

నాకు నా సాహిత్య జీవితంలో మరిచిపోలేని ఒక మాగేసిన మామిడి పండు లాంటి మధురమైన జ్ఞాపకం యాది. నాతో పాటు ఇంకా వారి మేన బామ్మర్ది హద్దునూరి నాగేంద్రంతో పాటు వారి పిల్లలు వరప్రసాద్ శివప్రసాద్ హరి ప్రసాద్ లకు కూడా ఆ గృహము ఎందరో ఉన్నతిని తీర్చిదిద్దిన కేంద్రం గేహము కూడా . వారి బంగ్లా నాకు ఆశ్రయము కల్పించడమే కాకుండా నా 50 ఏళ్ల కవిత్వ యాత్రలో ప్రధాన పాత్ర పోషించినది. అత్యంత మిక్కిలి భూమిక వహించినది. అప్పట్లో చదివిన.కొన్ని పుస్తకాలు నన్ను కన్నీటి పర్యంతం చేస్తే మరికొన్ని పుస్తకాలు అనేక ప్రశ్నలు నా ముందు నిలిపినాయి.

ఇంకా చెప్పాలంటే నా సాహిత్య మార్గ దర్శనంలో ముఖ్యమైన నిర్దేశకులు జక్కని వేంకటరాజం మరియు నిజాం వెంకటేశం సార్లు అయితే అందరికన్నా మిక్కిలి సాహితీ సోపతి గాడు నలిమెల భాస్కర్ సహచర కవులు మిక్కిలి ఆత్మీయ సహచర సాహితీ మిత్రులు జింబో, పిఎస్ రవీంద్ర, నందిగం కృష్ణారావులను ఇక్కడ ఈ సందర్భంగా తలుచుకోవడం నాకు అత్యంత ఇష్టం .

మా ఊరు తంగళ్ళపల్లి మానేరు ఇవతలి వైపు ఉంటే, అవుతలి ఒడ్డుకు సిరిసిల్ల ఉంటది. మధ్య వాగు మాత్రమే అడ్డంగా ఉన్నది . మానేరు వాగు ఇసుకలో పైసలు ఏరుకోవడం వలన ఇసుక నీరు పోయి వృద్ధాశ్రమం లోని తల్లిలా దిగులుగా కేవలం బొందల గడ్డగా మారింది. ఆ రోజుల్లో అంటే 1970 వ దశకం చివరలో మా ఇంట్లో కరెంటు ఉండేది కాదు. గ్యాస్ నూనె ఎక్కదీపం వెలుతురులో ఒకే దఫా ఎన్నెన్నో పుస్తకాలు కళ్లలో వత్తులు వేసుకొని చదివాను. మంచి చెడ్డ పుస్తకాలు అనేకం చదివి అందులో నుంచి మంచి సాహిత్య పుస్తకాలను ఎన్నిక చేసుకోవాల్సి వచ్చేది . ఒకానొక సందర్భంలో 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి చెందిన మిత్రుడు చెప్పగా ఆ ఊరికి సైకిల్ మీద పోయి పుస్తకం తెచ్చుకొని అధ్యయనం చేసిన రోజులూ ఉన్నాయి. ఎక్క దీపం పొగ ముక్కులోకి పోయిన నల్లని మసిని తుడుచుకొని ఆబగా చదువుకున్న కాలం అది.

ఇప్పుడు 50 ఏళ్ల వెనక్కి తిరిగి చూసుకుంటే, నా సాహిత్య వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దికోవడానికి చేయూత అందించిన వారిని తలుచుకోవాల్సిందే. అప్పుడు పత్రికలు విజయవాడ నుండి వస్తుండేది. ఆంధ్రప్రభ ఆదివారం సంచికలు మరియు సోమవారం సాహిత్య పేజీలు సిరిసిల్ల పెద్ద మోరి పక్కన ఉండే మోచీ మల్లయ్య డబ్బా చూరుకు నాకోసం చెక్కి ఉంచేవాడు. ఇకపోతే ఆంధ్రజ్యోతి ఆదివారం సోమవారం సాహిత్య సంచికలు బ్రదర్స్ టైలర్ నరసయ్య షాప్ లో ఎక్కడో ఒకచోట నాకోసం దాచి పెట్టేవాడు. బస్టాండులో పేపర్లు అమ్మే లక్ష్మీ రాజం వేప చెట్టు కింద డబ్బా దగ్గర కొంచెం కొంచెం చూసి చూడనట్టు చదువుకోనిచ్చేవాడు. ఇట్లా చెప్పుకుంటూ పోతే ఒక్క పైస కూడా నా జేబులో లేని రోజుల్లో నా సాహిత్య వ్యక్తిత్వ వికాసం దారిలో మైలురాళ్లలాటి సామాన్యులు చాలామంది యాది చేసుకోవలసి ఉంటుంది. నాకు బుద్ధి తెలిసిన తర్వాత వాళ్ల కాళ్లకు మొక్కుదామంటే వాళ్లలో కొందరు ఇప్పుడు శాశ్వతంగా లేరు . వాళ్ళ జ్ఞాపకాలు తడిగా ప్రతిరోజు ఇప్పటికీ నన్ను పట్టి కుదిపి వేస్తూవుంటున్నాయి.

గురజాడ, శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి కథలు చలం రాజేశ్వరి ఓ పువ్వు పూసింది కథలో అనితర సాధ్యమైన విద్యుత్తు కాంతి వాక్యాలు, శ్రీ శ్రీ మహాప్రస్థానం ,గోపీచంద్ అసమర్థుని జీవయాత్ర రావిశాస్త్రి భూషణం కథలు బుచ్చిబాబు చివరకు మిగిలేది తదితర పస్తకాలు.. రచయిత్రులు పత్రికల్లో సీరియళ్లు రాస్తున్న కాలం . కాళోజి, వరవరరావు, దాశరథి ,సి నారాయణ రెడ్డి, గద్దర్, శివసాగర్ మొదలగువారు కవిత్వంలో వారు పోయిన కొత్త పోకడలు సాహిత్యం లో నెలకొల్పిన తమవైన సొంత మార్గాలు నిర్మించిన విలక్షణమైన పాద ముద్రలు చాలా ఉన్నాయి. గాంధీ జీవిత చరిత్ర నెహ్రూ ఇందిరకు రాసిన లేఖలు బుద్ధుడు పూలే అంబేద్కర్ చింతనలు. మొదటి తెలంగాణ సాయుధ వీరులు పుచ్చలపల్లి సుందరయ్య బద్దం ఎల్లారెడ్డి రావి నారాయణరెడ్డిల జీవిత చరిత్రలు . తరిమెల నాగిరెడ్డి రాసిన తాకట్టులో భారతదేశం, పౌరాణిక బాగోతాలు హరికథలు పటం కథలు తోలుబొమ్మలాటలు గోత్రాల నరసయ్య మాల్యం ఖాళీ ప్రదేశంలో చుట్టూ రేకుల కంచె వేసి మధ్యలో నాటకాలు ఆడేవారు.. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక మంది కవులు రచయితలు వారి వారి పుస్తకాలు నన్ను నేను సాన పెట్టుకోవడానికి ఎంతో తోడ్పాటును అందించాయి. అత్యంత మిక్కిలి ప్రభావితం చేశాయి.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే సామాజిక తాత్విక అధ్యయన గ్రంథాలు మరొక ఎత్తు. మార్క్స్ లెనిన్ ల కమ్యూనిస్టు మేనిఫెస్టో పెట్టుబడిదారీ విధానం అదనపు విలువ కార్మికులు చెమటతో కూడిన శ్రమను యజమానులు లాభనష్టాల తీరుతెన్నులను అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు చూపిన తీరు నా సాహిత్య ప్రయాణానికి తెలివిడికి చేకూర్పు. నా చీకటి వెలుగుల దారిలో సరికొత్త కాంతులను ప్రసరింప చేశాయి. ఇవీ రేఖామాత్రంగా నా సాహిత్య యాత్రలో అధ్యయనానికి సంబంధించిన విషయాలు.


-జూకంటి జగన్నాథం
సెల్:94410 78095

ఇవి ఇలా ఉండగా తెలిపిన విషయాలు మాత్రమే నన్ను తీర్చిదిద్దాయని అనుకుంటే పొరపాటు అనిపిస్తున్నది వీటికన్నా మిక్కిలి ఇంకా ఇంకా ఏవో ప్రభావితం చేసినయి ఉన్నాయి అనిపిస్తుంది. అనిపించడమే గాక నా గ్రహింపు లోకి వస్తున్నవి. నా చుట్టూ ఉన్న నా స్థలకాలాల సమాజం మనుషులు ఎగుడు దిగుళ్లు ,ఎత్తు పంపులు కన్నీళ్లు కష్టాలు సంతోషాలు దిగులు వలసలు నా సాహిత్య వివేచనకు మిక్కిలి దోహదకారిగా పని చేశాయని ఇప్పుడు అనిపిస్తున్నది . అంతే కాకుండా నా చుట్టూ పక్కల ఉత్తర తెలంగాణలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న ఉద్యమాలు పోరాటాలు ఆరాటాలు ఆకాంక్షలు లక్ష్యాలు తృణప్రాయంగా ప్రాణాలను ప్రజల కోసం అర్పించే త్యాగాలు నన్ను నా సాహిత్య నిమ్నోన్నతాలలో నిరంతరం నన్ను జాగరూకతతో మెలిగేలా చేశాయి. తీరా నా ఈ 70వ వయస్సు పడిలో వెనుకకు తిరిగి చూసుకుంటే సమీక్షించుకుంటే పుస్తకాల కన్నా ఎక్కువగా నేను మెచ్చిన నచ్చిన ప్రభావితం చేసిన గ్రంధాల కంటే ఎక్కువగా నిచ్చెన మెట్ల సమాజంలో శ్రమ జీవన సౌందర్యాన్ని నింపుకొన్న తేజవంతమైన మనసులు నన్ను మిక్కిలి అత్యంత ప్రభావితం చేసి నన్ను ఎల్లకాలం సాహిత్య ప్రవాహంగా కొనసాగేలా చేశాయి .నిశ్చయంగా ప్రజలు సమాజమే సాహిత్య పఠనా స్థలాలు పాఠ్యపుస్తకాలే జీవగర్రలు అనిపిస్తున్నది. తోస్తున్నది.

# చెట్ల సంభాషణ



చెట్లు ఒకదానితో మరొకటి సంభాషిస్తాయి
ఒక చెట్టు అప్పుడే పుట్టిన కరపత్రాలతో ఒణుకుతున్న
కొమ్మను వొంచుతుంది
ఒక చెట్టు గూడును గట్టిగా పట్టుకుంటుంది
ఒక చెట్టు తన గోధుమరంగు వొంటి మీద
వ్యాపిస్తున్న లిచెన్ (lichen) వ్యాధిని చూపిస్తుంది

మరొక చెట్టు కాండం మీద గొంగళి పురుగులు
పాకుతుంటాయి
సూర్య రశ్మిని పంచుకోవడానికి ఒకచెట్టు
మరొక చెట్టు వైపు తన ఆకులను తిప్పుతుంది
మరొక చెట్టు భూమి అడుగున తేమ వున్నచోటుకు
తన వేళ్ళను లాగుతుంది
గాలి పలక మీద చెట్టు రచన చేస్తుంది
చదవడానికి పరిమళాల భాష తెలియాలి
వెన్నెల కిరణాల మీద , నీటి సరస్సుల మీద
చెట్లు వాన చినుకులు, మంచు భాష్పాలతో బొమ్మలు
చిత్రిస్తాయి
చిన్నప్పుడు మీరు ఎంత తరచుగా మేల్కొని ఉండి
ఏకాంతంగా వనాలలో సంచరించేవారు ?
నిజం, ఉడతలు మన టేబుళ్ల మీద పరుగులు
తీయవు
పక్షులు కుర్చీలను ముక్కుతో పొడవవు
కానీ, కొయ్య బొమ్మలను తయారు చేయడానికి
మనం ఉబలాటపడతాము పక్షులు రెక్క విప్పాల్సిన
చెట్టుతో పురాతన శిధిలాల తో వికృతంగా చెక్కిన
ఎడ్లబండి ని తవ్వి తీయండి
కొయ్య తో చేసిన నావలు, కార్లు, రైళ్లు, విమానాలతో
మనం ఆడుకుంటాము , కొయ్య కత్తులు,
సైనికులతో కూడా
దుంగలతో చేసిన దేవుళ్ళు, శిలువల ముందు ,
ప్రార్థించడానికి సాగిల పడతాము
ఇప్పుడిక ఈ కాయితం మీద క్షమించమని
యాచిద్దాము

**గుజరాతీ మూలం : దిలీప్ ఝువేరి**
**తెలుగులోకి : వంశీకృష్ణ**

# దీర్ఘకాల కథా యోధుడు ఆజాద్!

పి.చంద్రశేఖర అజాద్ ఈ పేరు మనసులోకి రాగానే ,కొత్త,పాత తరాల వారికి ఆ పేరు స్ఫురణకు వస్తూనే,సుధీర్ఘ కాలం కథా,నవలా యోధుడుగా నేటికీ విజేతగా విజయ బావుటా ఎగరేస్తూ అజేయంగా నిలుస్తున్న సుప్రసిద్ధ రచయిత అజాద్ గుర్తుకు వస్తారు. కొందరి రచనలు కాలక్షేపంగా నడుస్తాయి ,మరి కొందరివి చదివిన కొంత సమయం తర్వాత మర్చిపోతాం,ఆజాద్ గారి కథలు అలా కాదు,ఆజాద్ గారి కథలు చదవాలనే ఉద్దేశ్యంతో 'నేను ఆ నెమలి' ని ఏకబిగిన చదివిన తర్వాత అనేక ఆలోచన్ల కోణమై,చిన్న చిన్న విషయాల్ని విశ్లేషిస్తూ,అనంతమైన కాన్వాసు మీద నిరూపిస్తూ సాగిన కథల మణిహారం కనబడింది.నా రచనలకు అనేక దార్లు కనబడుతూ ,ఆ స్ఫూర్తితో విస్తృత దృష్టితో రాయడం నాక్కొంచెం అలవాటైంది.




రచనలు పాఠకుల్ని మెప్పించడమే కాదు,సామాజిక అంశాల్ని చొప్పిస్తూ,చదివే వారిని ఆలోచన్ల సంద్రంలో పడేయాలి.అవి వారి జీవితాల్లో సమాంతరంగా ప్రవహిస్తూ,అనేక వికాసాలకు ప్రేరణ కావాలి.అలాంటి కథల్ని,నవలల్ని సుదీర్ఘ కాలం రాస్తూ,ఎందరికో స్ఫూర్తిని, మార్గదర్శకాల్ని ఏర్పరిచిన ఆజాద్ ని చదవడమంటే ఒక పెద్ద ఎన్ సైక్లోపీడియా,ప్రపంచ ప్రసిద్ధ మానసిక శాస్త్రవేత్తలా కన్పిస్తాడు.సాహిత్యంలో అనేక కోణాల్ని లోతైన చర్చలతో విప్పి చెప్తాడు. అజాద్ గురించి అన్నీ చెప్పాలంటే వెయ్యి పేజీల పుస్తకం అవుతుంది. పరిమితికి లోబడి నేను కొన్నిటినే చెప్తాను. 'నేను ఆ నెమలి' కథా సంపుటిలో 'సుశీల' కథలో ఒకచోట ' నా దేహానికి శీలం మీరు తీసేసినా, మనసుకు శీలం పోగొట్టుకున్న దాన్ని కాదు ', నీళ్ళూ రక్తం కథలో ' రక్త సంబంధాల ముందు, బయట మిత్రులు క్లోజ్ సంబంధాలైనా నీళ్ళు లాంటి పలుచనే ' , 'మరణం అసంపూర్ణ కావ్యం' కథలో ' అతని జ్ఞాపకాలు అభిమానించే వారికి బతికి ఉన్నంత కాలం చిగురిస్తూనే ఉంటాయి ' లాంటి వాక్యాలు అన్ని కథల్లోనూ అంతర్లీనంగా చొచ్చుకుపోయి,తాత్విక దృష్టితో మనల్ని ఆలోచన్ల పట్టాలపై నిలబెట్టి,ముందుకు పరుగెత్తిస్తాడు.'విపరీత వ్యక్తులు' నవల సమాజంలో ఒక స్థాయి మేధావుల్ని సైతం గింగుర్లు కొట్టిస్తూ,దానిలోని భావ చింతనలు పట్టి వదలని ముద్రల్లా అతుక్కుపోయి,అత్యున్నత స్థాయి రచయితలో మేధోశక్తికి పరాకాష్ఠగా నిలుస్తుంది.ఒకటి కాదు ,రెండు కాదు.'ఆహానికి రంగుంది', 'మేకింగ్ ఆఫ్ ఏ రైటర్' ఇలా వరుస క్రమంలో చెప్పుకు పోతే,వేల


పి.చంద్రశేఖర ఆజాద్

పేజీలు రాయాలి.సుమారు వంద నవలలు,వెయ్యి కథలు, వేల సీరియల్స్,సినిమా స్క్రిప్టులు,వీటన్నిటి రూపమే తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచే వారి వరుసన నిలబడ్డాడు. వంద కథలకు, ముప్పై నాలుగు నవలలకు బహుమతులు,అనేక పురస్కారాలు,కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చాయి,ఇవన్నీ ఆజాద్ కి గీటురాళ్ళు కాదు. వీటికి మించి పోయినవేవైనా ఉంటే అవన్నీ వచ్చి తీరాలి!కానీ, ఏ పురస్కారం కోసం,మరేదాని కోసమో రాసే మనిషి కాదు,అతని భావాల్ని,సమాజంలో అతని దృష్టి కోణాల్ని రచనల్లో ప్రస్ఫుటిస్తూ చెప్పుకుంటూ పోయే నిరంతర ప్రయాణం అజాద్ ది. అతనితో గడిపిన క్షణాలు కవులకు,రచయితలకు అనేక సందేహాల నివృత్తి చేసే నిఘంటువులా,అతని మాటల స్పర్శ చెరిగిపోని ఓ దిక్సూచిలా అంటుకుని వదలవు.

(కథా ఋషి మునిపల్లె రాజు గారి పురస్కారం పి.చంద్రశేఖర అజాద్ గారు అందుకున్న సందర్భంగా...)

**– ఉండవిల్లి.ఎమ్**
**( కవి,కథా, నవలా రచయిత )**

# వాడూ! నేనూ!

వాడూ నేనూ బాల్య మిత్రులం
పెరిగి పెద్దయ్యాక దారులు వేరయ్యాయి,
వాడూ నేనూ కవులయ్యాం
వేదశాల వాడంటే! వేధశాల నేనంటా!

కీర్తి కొలనుల్లో బంగరు పద్మాలవెంటవాడు
కార్మిక జనావళిలో పూరి పేద వాడల్లో నేనూ
వేద పురాణాలు, ఉపనిషత్తులు వాడు ప్రవచిస్తుంటే
వేదనలూ, రోదనలూ పోరాటాలూ నేను రచిస్తుంటే
కలవని మా భావాలు రైలు పట్టాల్లా ఉన్నై!

ధనికులు, ధర్మకర్తలంటాడు వాడు
శ్రామికులే చరిత్ర నిర్మాతలంటాను నేను
మతం మత్తులో వాడు
మానవతా జగత్తులో నేనూ
పుటం పెట్టిన బంగారంలా "సత్యం" నిలుస్తుంది
విశ్వమంతా సైన్స్ శాస్త్రీయత వెంట నడుస్తుంది

భావాలు వేరైనా! దారులు వేరైనా! నమ్మకాలు ఏవైనా!
విశ్వ ప్రేమిక ప్రేమలో కలుసుకొన్నాం
సమత, మమత, శాంతి, సోపతి తోడైనాయి.


- తంగిరాల చక్రవర్తి (ఎంఫ)
రచయిత, కవి, 9393804472

రచనలకు ఆహ్వానం
సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

పుస్తక సమీక్షల కోసం
తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# నెమరువేత

దూరాల్ని కొలవడం.
నీవు దూరమైన కాలాన్ని పిలవడం.
నీలోకి నీవు చేరడం.
నీకు నీవేమిటో తెలియడం.
నీవు పోగొట్టుకున్నదేదో..
నీవు పొందుతున్నదేదో..
ఒక ఎరుకగా నడవడం.
ఒక ఏకాంతాన్ని కలవడం.
ఒక నిశ్శబ్దాన్ని తడమడం.
ఒక అనుభూతిలో తడవడం.
ఒకానొక సౌందర్యాన్ని పొందడం.
ఒక అనుబంధం మంచు పూల చినుకై జారడం.
వికసిత నయనాలతో,
లాస్య వదనాలతో
పరిమళ భాషలో
ఒక సంభాషణగా సాగటం
ఇది ఒక యాత్ర.
ఒకానొక జాతర.
కొన్ని సామాజిక క్షణాల నిశ్శబ్ద చరిత్ర.
ఇందులో ధ్యానముంటుంది.
సామాజిక జ్ఞానముంటుంది.
నీవు ఇంతకు మునుపెన్నడూ
చూడని కాలముంటుంది.
ప్రకృతి ఒడిలోకి అంటే
అమ్మ ఒడిలోకి వెళ్లడముంటుంది.

నీ బాల్య జలపాత ప్రవాహ కాలాన్ని
వినిపించడముంటుంది.
నీ ఒక దృశ్యమవ్వడం
నీ ఒక కావ్యమవ్వడం
నీవు ఒక నవ్య దివ్య జీవన దీపమవ్వడం
ఆ స్వయం ప్రకాశిత మినుగురుల వెలుగుదారుల్లోంచి గత చీకటిని కనుగొని వర్తమానం మీదుగా
భవిష్యత్తును కలగనడం
ఆచరణగా ప్రవహించడం ఒక యాత్ర.
ఇదొక అక్షర జలపాతాల విశ్వంభర జాతర.
కాలం రెక్కలతో.. కలం కన్నులతో
ఊహల ఊపిరితో
అనుభవాల అనుబంధంతో
అనుభూతుల మాధుర్యంతో
సామాజిక సౌందర్య దృశ్య కావ్య
రచన ఈ యాత్ర.
ప్రకృతి వర్ణాల హృదయ
సమ్మేళన గీతం ఈ యాత్ర.
(గతం నుండి నేటి వరకు అనేకులు అప్పుడప్పుడు
ఈ యాత్ర రచనలను అందిస్తూనే ఉన్నారు.
వారు దర్శించిన అనేక ప్రాంతాలను
నేలగా పరామర్శిస్తూనే ఉన్నారు.
అయితే ఇక్కడ ఒక ప్రత్యేకత
నేను గమనించింది
ఒక నలుగురు సామూహికంగా చేసిన ఒక యాత్రా
సంభాషణ.
నాలుగు మిణుగురులు
వెలుతురు పూల సందర్శన.)


- శిఖా ఆకాష్, సెల్:9381522247

## రామప్ప, మేడారంను సందర్శించిన వివిధ రాష్ట్రాలకు చెందిన రాజనీతి శాస్త్ర ప్రొఫెసర్లు

**ములుగు, మహా :** కాకతీయ యూనివర్సిటీలో జరిగిన రెండు రోజుల సెమినార్ ముగించుకొని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రొఫెసర్లు హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ సంకినేని వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం రామప్ప దేవాలకయం, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. రామప్పలోని కాకతీయుల కట్టడాలు చాలా అద్భుతమని, ప్రపంచంలోనే మరో వింతగా కనిపిస్తుందని కొనియాడారు, సమ్మక్క సారక్క జాతర ప్రదేశాన్ని సందర్శించి ఇది ప్రపంచంలోనే పెద్ద ఆదివాసీ జాతర అని, తల్లులను దర్శించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, జాతర సమయంలో మళ్లీ వస్తామని పేర్కొన్నారు. రామప్ప, సమ్మక్క సారక్క జాతరలను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసేవిధంగా తమకున్న వనరులతో పుస్తకాలను తయా



రుచేసి ప్రపంచానికి అందిస్తామని తెలియజేశారు. అదేకాకుండా వరంగల్ లో కాకతీయుల పరిపాలన చాలా అద్భుతమని, గొలుసుకట్టు చెరువులు, వారు నిర్మించిన దేవాలయాలు తరతరాలుగా చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉన్నాయన్నారు. కాకతీయుల సామ్రాజ్యం పాలనాదక్షతకు నిదర్శనంగా కనిపిస్తోందన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలో కొంత విఫలమైనట్టు తాము భావిస్తున్నామని, కానీ భవిష్యత్తులో అభివృద్ధికి నిధులు కేటాయించి దేశంలోనే ప్రాముఖ్యమైన ప్రదేశాలుగా తీర్చిదిద్దాలని ప్రొఫెసర్లు తెలియజేశారు. ముఖ్యంగా మేడారం సంబంధించిన సమ్మక్క సారక్క జాతరను జాతీయ జాతరగా తక్షణమే కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని, ఇక్కడి ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా ప్రభుత్వాలు స్పందించాలని తెలియజేశారు. ఈ పర్యటనలో గోవా రాష్ట్ర ప్రొఫెసర్ ప్రకాష్ దేశాయ్, తమిళనాడు ప్రొఫెసర్ లక్ష్మణన్ , కేరళ రాష్ట్రానికి చెందిన ప్రొఫెసర్ జోష్ జార్జ్ , ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కి చెందిన ప్రొఫెసర్ అంజిరెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ శ్రీనివాసులు, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ అంకిళ్ళ శంకర్ , కలిపిండి వినోద్ , చేరాల శివప్రసాద్, అట్ల రాజిరెడ్డి, తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

## కరెంటు తీగలు తగిలి గడ్డి వాము దగ్ధం



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని ముసిపట్ల గ్రామంలో ఓ ట్రాక్టరుకు మంటలు అంటుకుని గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే, ముసిపట్ల గ్రామానికి చెందిన బిల్లా కోమటి ఆనందం అనే రైతు దగ్గర గడ్డి కొనుగోలు చేసిన ఆత్మకూర్ మండలానికి చెందిన సిద్ధారెడ్డి అనే వ్యక్తి, ట్రాక్టర్లో తరలిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ముసిపట్ల గ్రామంలో ట్రాక్టర్పై ఉన్న గడ్డి కరెంటు తీగలకు తగిలి మంటలు అంటుకున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో గడ్డి పూర్తిగా దగ్ధమయ్యిందని, అయితే ట్రాక్టర్కు ఎలాంటి నష్టం వాటిల్లలేదని అధికారులు తెలిపారు. స్థానికులు తగిన జాగ్రత్తలు పాటించాలని, గడ్డి తరలింపులో అప్రమత్తంగా ఉండాలని అధికారులు అంటున్నారు,

### భగత్ సింగ్ సుఖదేవ్ రాజ గురు
## ఆశయాలను సాధిద్దాం



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో సర్దార్ షాహిద్ భగత్ సింగ్ శివరాం హరి రాజగురు సుఖదేవ్ తాపర్, వర్ధంతి సందర్భంగా మోత్కూరు మండల కేంద్రంలోకేఆర్ భవన్ లో యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్పలపల్లి ప్రశాంత్ మరియు మోత్కూరు మండల యువజన సమాఖ్య ముఖ్య నాయకుల సమక్షంలో వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించడమైనది భగత్ సింగ్ 27 సెప్టెంబర్ 1907న రాజగురు 24 ఆగస్టు 1908 న సుఖదేవ్ 15 మే 197న పంజాబ్ మహా రాష్ట్రలలో జన్మించినారు భారతదేశ దాస్య విముక్తి కోసం జరిగిన పోరాటంలో తెల్లవాని గుండెల్లో చీల్చి చెండాడిన వీర యోధులకు వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించి, ఈనాటి యువత ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం కోసం యువత చెడు మార్గం పోకుండా సమసమాజ స్థాపన కుల మత తత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో దాసరి చింటూ కూ రెల్ల ప్రశాంత్ చెడిపల్లి అరవింద్, మరియు సిపిఐ జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సిపిఐ మోత్కూరు మండల కార్యదర్శి అనెపు వెంకట్ గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు, చాపల అంజయ్య ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు గొలుసుల యాదగిరి చేనేత కార్మిక తి సంఘం జిల్లా నాయకులు పోచం కన్నయ్య గీత పని వాళ్ళ సంఘం పట్టణ నాయకులు అన్నెపు కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు,

### రాష్ట్ర బడ్జెట్ లో చేతి వృత్తిదారుల సంక్షేమానికి
## 25 వేల కోట్లు కేటాయించాలి



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేతి వృత్తుల సంక్షేమానికి నామమాత్రపు నిధులు కేటాయించడం పట్ల చేతివృత్తుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిర్లక్ష్యానికి నిదర్శనమని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి చేతివృత్తుల సంక్షేమానికి 25 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని చేతి వృత్తుల సంక్షేమానికి నిధులు విడుదల చేసి అట్టి కుటుంబాలకు అందించాలని తెలంగాణ చేతివృత్తుదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బోలగాని జయరాములు ప్రభుత్వాన్ని కోరారు, మోత్కూర్ పట్టణంలోని స్థానిక గెస్ట్ హౌస్ లో తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ యాదాద్రి భువనగిరి జిల్లా సమావేశం చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు, అధ్యక్షతన జరిగింది, వృత్తిదారుల ఉపాధి మెరుగుపరుచుటకు, అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు. 202425 సంవత్సరం బడ్జెట్లో కేటాయించిన డబ్బులు కూడా ఖర్చు చేయలేదు. ఈ బడ్జెట్ లో 25 వేల కోట్ల కేటాయించి వృత్తి దారుల సంక్షేమానికి ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు, ఉత్పత్తి వృత్తులు చేసేవారు నేత, గీత, మత్స్య, గొర్రెలు మేకలు పెంపకం,ఇనుము, కలప, ఇత్తడి, బంగారం, అల్లికలు, దూదేకుట, రాల్లు కొట్టడం, కుండలు, టైలరింగ్, సేవా వృత్తులు చేసేవారు రజక, క్షౌర, సాంస్కృతిక వృత్తులు చేసేవారు ఒగ్గు కథ, మందహెచ్చులు, దుబ్బుల కొలుపు, వాయిద్య కళాకారులు, పడపోత్ర, గంగిరెద్దుల, జెట్టి, ఏనూటి తదితరులు నేటికి గననీయమైన సంఖ్యలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్నారని. వృత్తుల్లోకి బడా పెట్టుబడి దారులు ప్రవేశించడంతో వ్యాపారంగా మారి వృత్తిదారులు వారి కింద జీతాలు తీసుకొని పనిచేసే కార్మికులుగా మారిపోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత, స్వర్ణకారులు ఆకలి చావులకు, ఆత్మహత్యలకు గురవుతున్నారు. లిక్కర్ శీతల పానీయాల దాటికి కల్లుగీత వృత్తి మరింతగా దెబ్బతింటున్నది. రజక, క్షౌర లాంటి సేవా వృత్తులు యాంత్రీకరణ వల్ల ఆదాయం కోల్పోతున్నారు. పెత్తందారుల చేత కులవివక్ష, అవమానాలు, సాంఘీక బహిష్కరణలకు, దాడులు, దౌర్జన్యాలకు,హత్యలకు గురవుతున్నారు, మత్స్య సంపద రియల్ ఎస్టేట్, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వలన చెరువులు, కుంటలు, జలవనరులు కబ్జాలు కాలుష్యానికి గురవుతున్నాయి, గొర్రెలు, మేకలు పెంపకం వృత్తిలోకి పెట్టుబడిదారులు ప్రవేశిస్తున్నారు. వైద్యం, మేత సరిపడా ప్రభుత్వం అందించలేక పోతుంది. వడ్డెర, వడ్రంగి, ఇనుము పని, బంగారం, ఇత్తడి, శిల్పాలు చెక్కుట, దూదేకుల, కుమ్మరి, దాసరి, సగర, ఉప్పర,బట్రాజులు, బోయ, పూసల, టైలర్ వీరితో పాటు బ్యాండు, వాయిద్య, ఒగ్గు, మందహెచ్చుల, దుబ్బుల కొలుపు, పడపోత్ర, గంగిరెద్దుల, జెట్టి, ఏనూటి తదితర సాంస్కృతిక వృత్తులవారు వృత్తిలో బ్రతకలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేతి వృత్తి చేసేవారి ఉపాధి భద్రతకు, సామాజిక రక్షణకు, చిత్తశుద్ధితో పనిచేయాలి. సంక్షేమానికి బడ్జెట్ లో తగిన నిదులు కేటాయించాలి అని ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఇట్టి సమావేశంలో చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి గుండు వెంకట నర్సు. తెలంగాణ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి మద్దెపురం రాజు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్. తెలంగాణ క్షౌర వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ వేముల బిక్షం. తెలంగాణ మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ పోతరబోయిన సత్యనారాయణ. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తిని బిక్షం. మహిళా నాయకురాలు రాచకొండ రాములమ్మ. గుండు లక్ష్మి. రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు మెతుకు అంజయ్య. కుర్మేటి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వా వసు నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ

**హైదరాబాద్ మహా :** హైదరాబాద్ మిని స్టర్స్ కాలనీలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ చేతుల మీదుగా ధూప దీప నైవేద్య అర్చక సంఘం తెలంగాణ రూపొందించిన విశ్వ వసు నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరించబడింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే భగవంతుని అనుగ్రహం అనివార్యం అని పేర్కొన్నారు. అర్చకుల భద్రత, శ్రేయస్సు కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతినెలా వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే, ధూప దీప నైవేద్య అర్చకులకు మెరుగైన వేతనం అందించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి అని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శైలజ రామయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, అదనపు కమిషనర్ కృష్ణవేణి, రీజనల్ కమిషనర్ రామకృష్ణారావు హాజరయ్యారు. రాష్ట్ర అర్చక సంఘం అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ



మాట్లాడుతూ, ఈ నామ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం సుసంపన్నంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అర్చకుల హక్కుల కోసం సంఘం నిరంతరం శ్రమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవజ్ఝల ప్రసాద్ శర్మ, తిరునగరి వెంకటాద్రి స్వామి, నందనం హరికిషన్ శర్మ, ఫణికుమార్ శర్మ, అమరేశ్వర శర్మ, మహేషు, రవికుమార్, లక్ష్మీకాంతాచార్యులు, భార్గవాచార్యులు, సంతోష్ శర్మ తదితర రాష్ట్ర, జిల్లా స్థాయి అర్చక సంఘాల నాయకులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుండి అర్చకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



### ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ను
## సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**హుజూర్ నగర్, మహా :** నూతనంగా ఎన్నుకోబడిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ను మఠంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్య మంజు నాయక్, ఎస్ టి సెల్ జిల్లా అధ్యక్షులు ధరావత్ నవీన్ నాయక్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబు నాయక్, సేవాలల్ కన్వీనర్ బాణోతూ తులసిరాం నాయక్, టిపిసిసి అధికార ప్రతినిధి బానోతూ భాస్కర్ నాయక్, మాజీ సర్పంచ్ బానోతు వీటీ నాయక్ ,భరత్ నాయక్, బజ్జు నాయక్ ,చింటూ నాయక్, హనుమాన్ సింగ్, మూడు నాగేశ్వరరావు, వాంకుడోత్ గోవిందు నాయక్ మొదలైన వారు పాల్గొని సన్మానించడం జరిగింది

### బిజేపి ఆధ్వర్యంలో
## ఘనంగా షహీద్ దివస్ వేడుకలు



**కరీంనగర్, మహా:** భారతీయ జనతా పార్టీ కరీంనగర్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున పట్టణంలోని భగత్ నగర్ భగత్ సింగ్ విగ్రహం వద్ద షహీద్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, తాజా మాజీ మేయర్ సునీల్ రావు లు భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం , భరతమాతను రక్షించడానికి తమ ప్రాణాల్ని సైతం తృణ ప్రాయంగా విడిచి పెట్టడానికి సిద్ధపడిన ఆ అమరవీరులే భగత్సింగ్, సుఖ్దేవ్, రాజ్గురులనీ , వీరిని 1931 మార్చి 23వ తేదీన లాహోర్ సెంట్రల్ జైల్లో ఉరి తీశారనీ, . ఈ విప్లవ వీరుల బలిదానానికి చిహ్నంగా మార్చి 23వ తేదీని 'షహీద్ దివస్'గా, అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా దేశమంతా జరుపుకొంటున్నామని తెలిపారు. నాడు బ్రిటిష్ వారి ఆకృత్యాలకు వ్యతిరేకంగా భగత్సింగ్, సుఖ్దేవ్, రాజ్గురులు వీరోచిత పోరాటాలు చేశారన్నారు. తమను ఉరి తీయవద్దని, ఉరితీస్తే ఈ పుణ్యభూమిని వదలి మా పాదాలు గాలిలో ఉంటాయని, అదే కాల్చి చంపితే భరతమాత ఒడిలో చనిపోతామని కోరుకున్న నిజమైన దేశభక్తులన్నారు. కలిసి ప్రాణ స్నేహితులుగా బ్రతికామని, కలిసి మరణిస్తున్నామని ఉరితాడును ముద్దాడుతూ 'ఇంక్విలాబ్ జిందాబాద్!' అంటూ భరతమాత చెంతకు చేరిన గొప్ప ఫ్రీడమ్ ఫైటర్స్ భగత్ సింగ్, సుఖ్దేవ్, రాజ్ గురు అని కొనియాడారు. ఆ విప్లవవీరుల త్యాగ ఫలితమే మనం నేడు అను భవిస్తున్న ఈ స్వేచ్ఛ స్వాతంత్రం అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నాంపల్లి శ్రీనివాస్ , మాడ వెంకటరెడ్డి , బల్బీర్ సింగ్ , బండ రమణారెడ్డి, చొప్పర్ జయశ్రీ , బండారు గాయత్రి, వరల జ్యోతి,నరేందర్ ,పొన్నం మొండయ్య ,తణుకు సాయి, రాజు , గాజుల వేణుగోపాల్, రామ కృష్ణారెడ్డి ,బొడ్ల శ్రవణ్, వంగ సంపత్, పిట్టల సుమంత్ ,వంశీ అనుదీప్, ధోలీ ఉపేందర్ ,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ త్యాగం ప్రపంచానికి స్ఫూర్తిదాయకం



- ఆయన ఆశయాలు యువత ఆదర్శం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా, మహా :** భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ చేసిన పోరాటం ప్రపంచానికి స్ఫూర్తిదాయకం, అయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం మంచాల మండలం, ఆరుట్ల గ్రామ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన, భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... దాస్య శృంఖలాలను విముక్తి చేయడానికి ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించిన వీరుడని, చిరునవ్వుతో ఉరికంభం ఎక్కి తనను చంపినా తన ఆశయాలను చంపలేరు అంటూ, ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు ఇస్తూ మరణించాడని, అలాంటి పోరాట యోధుడిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు అశోక్ ముదిరాజ్, మాజీ మంచాల మండలం అధ్యక్షులు ముచ్చర్ల వెంకటేష్, గ్రామ కార్యదర్శి రమేష్ ముదిరాజ్, మాజీ ఉపసర్పంచ్ వేదిరే రమణారెడ్డి, మార సురేష్, మాజీవార్డు సభ్యులు సురేష్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ, వాస్పరి కుమార్, ఎండి గాలిబ్ భాయ్, ఎండి ఇమ్రాన్, జక్కుల యాదగిరి, కోరే శ్రీను, మోహన్ రెడ్డి, లాలగారి గణేష్ యూత్ కాంగ్రెస్ నాయకులు మంకు ప్రవీణ్, రైనా ముదిరాజ్, దూసరి రాజు, ఎండిఅశు, ఆర్ల శ్రీకాంత్, వెంకటేష్, తిమ్మగల్ల గౌతమ్, జంగయ్య, ప్రభాకర్, లింగస్వామి, రాజు, మధు గ్రామ పెద్దలు కృష్ణయ్య, పాండు, పుల్లారెడ్డి, యాదయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆదరణ గ్రామీణ వైద్యుల సంఘం
## అధ్యక్షునిగా శంకర్ రావు



**ములుగు, మహా :** ములుగు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ లో ములుగు మండల ఆదరణ గ్రామీణ వైద్యుల సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆదరణ గ్రామీణ వైద్యుల సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా కె.శంకర్రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.కృష్ణ, కోశాధికారిగా ఎ.సదానందంను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనటువంటి అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఆదరణ గ్రామీణ వైద్యుల సంఘం బలపడడానికి మావంతు కృషి చేస్తామని, అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆర్ఎంపీల మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించి సంఘం బలపడడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆర్ఎంపీలు డీపీ.జనార్ధన్, కె.రాజమౌళి, బి.రవీందర్, ఎండీ. రహీముద్దీన్, ఇతర ఆర్ఎంపిలు పాల్గొన్నారు.

## బత్తిని రాజు గౌడ్ కి గౌరవ డాక్టరేట్




**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోనీ పనకబండ గ్రామానికి చెందిన సామజిక సేవకుడు బత్తిని రాజు గౌడ్ సేవలను అంతర్జాతీయ పీస్ విశ్వవిద్యాలయం గుర్తించి పాండిచ్చేరి తమిళనాడు పట్టణంలో గౌరవ డాక్టరేట్ అందజేసింది. విశ్వవిద్యాలయ ఇంచార్జి ప్రతినిధులు, ప్రొఫెసర్ డిఆర్, ఎస్, చల్లాద్రి వైస్ ఛాన్స్లర్ డిఆర్, ఎ, ప్రబోధ్ రాజేంద్రన్ చీఫ్ డైరెక్టర్ సౌత్ ఇండియా యుఎన్ఐపిసి, డిఆర్, డి, లక్ష్మీ కాంతం చైర్మన్ ఎస్హెచ్ఆర్డిఓసి, డిఆర్,వల్లపోడి వెంకటరత్నం డైరెక్టర్ ఎన్ఆర్ఓ రాజు గౌడ్ కి పట్టాని అందజేశారు. బత్తిని రాజు గౌడ్ చేపడుతున్న పేదలకు సాయం,విద్యార్థులకు చేయూత, వృద్ధులకు ఆసరా తదితర పనులను పరిశీలించి గౌరవ డాక్టరేట్ అందించాలని ఎంపిక చేశారు. సమాజ అభివృద్ధికి సహకరించిన రాజు గౌడ్ పనితీరు అభినందనీయమని అతిథులు అభినందించారు. ఈ సందర్భంగా డా. రాజు గౌడ్ మాట్లాడుతూ అవార్డులు ఆభరణం కాదని మరింత బాధ్యతను, పెంచుతాయన్నారు. ఈ అవార్డు అందించినందుకు విశ్వవిద్యాలయ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తోటివారికి సాయమందించడమే తన లక్ష్యమన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని అన్నారు.



## ఎన్సీఈఆర్టీ జాతీయ కౌమార విద్యా సదస్సుకు
### డాక్టర్ కందాల రామయ్య

**ములుగు, మహా :** ప్రముఖ విద్యావేత్త, మనో వైజ్ఞానిక వేత్త, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ కందాల రామయ్య జాతీయ కౌమార విద్యాసదస్సుకు ఎంపికయ్యారు. ప్రతిష్ఠాత్మకమైన వికసిత్ భారత్ కోసం కౌమార విద్యా సమస్యలు, సవాళ్లు, పరిష్కారాలు అనే జాతీయ సదస్సులో తన పరిశోధన పత్రాన్ని సమర్పించేందుకు ఎంపికయ్యారు. ఈనెల 24, 25 తేదీల్లో భోపాల్లో ప్రాంతీయ విద్యా సంస్థ (ఎన్సీఈఆర్టీ) ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. డాక్టర్ రామయ్య అందుకు సంబంధించిన వివరాలను తెలుపుతూ కౌమారదశలో గల బాలికలలో ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలు అనే అంశంపై తాను చేసిన పరిశోధన, విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దాని ప్రభావం, ఒత్తిడిని ఎదుర్కొనే పద్ధతులను విశ్లేషిస్తోందన్నారు. జాతీయ మెంటర్ (ఎన్సీటీ) జాతీయ, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గా విద్యారంగానికి సేవలందించే అవకాశం కలగడం తన అదృష్టమన్నారు. మనోవిజ్ఞానశాస్త్రంలో భావోద్వేగ ప్రజ్ఞ, ఒత్తిడి, ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలు, మంత్రణం మరియు మార్గదర్శనం తదితర అంశాల్లో రామయ్య విశేష పరిశోధనలు చేశారు.

## మత విద్వేషాలకు బీజేపీ ప్రభుత్వం పునాది వేస్తోంది
### రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోదీ ప్రభుత్వం



**హన్మకొండ, మహా :** భారత రాజ్యంగాన్ని నిర్వీర్యం చేస్తూ దేశ ప్రజల హక్కులను హరించే కుట్రలో భాగమే అంబేద్కర్ ని అవమానించడం అని దేశ వ్యాప్తంగా జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నినాదం తో కాంగ్రెస్ పార్టీ రాజ్యంగాన్ని పరిరక్షిస్తుందని హనుమకొండ జిల్లా అధ్యక్షులు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగిన భారత దేశం బలమైన రాజ్యంగా విలువలతో కూడిన అభివృద్ధి చెందిన దేశమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ,వరంగల్ పశ్చిమ నియోజవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఆదివారం రోజున హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,టీపీసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే పిలుపుతో దేశవ్యాప్తంగా బీజేపీ పార్టీ కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని వరంగల్, హనుమకొండ జిల్లాల కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రెండు జిల్లాకు ఇంచార్జ్ లుగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాయల నాగేశ్వర్ రావు లను నియమించారు. ఈ సన్నాహక సమావేశంలో పరకాల నియోజకవర్గ శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , నగర మేయర్ గుండు సుధారాణి ,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర ద్వారా దేశ ప్రజల్లో సమానత్వం,సౌభ్రతుత్వం పట్ల పాదయాత్ర చేసి దేశ ప్రజలను చైతన్యవంతం చేశారని గడిచిన 11 ఏళ్లుగా రాజ్యాంగాన్ని రాజ్యంగా విలువలని కాలగర్భంలో కలిపేసే ప్రయత్నం బీజేపీ ప్రభుత్వం చేస్తుందని ఎమ్మెల్యే నాయిని మండిపడ్డారు.జనవరిలో పార్లమెంట్ వేదికగా కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారిపై చేసిన ప్రసంగం పై దేశవ్యాప్తంగా ప్రశ్నించాల్సిన అవసరం ఆవశ్యకత ఉందని అన్నారు.రాజ్యంగా విలువలని గౌరవించే విధంగా రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకున్నదని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే మన దేశంలో మతకల్లోలాలు సృష్టించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం పట్ల దేశ నలుమూలల నుంచి సమాధానం చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు.జై బాపు జై భీమ్ జై సంవిధాన్ మన దేశ భవిష్యత్ కోసం మన నినాదమని అన్నారు.

## బిజెపి జిల్లా నూతన అధ్యక్షుడుకి
### శుభాకాంక్షలు వెల్లువ

- వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం
- జిల్లా కార్యకర్తల్లో నూతన ఉత్సాహం
- బిజెపి రాష్ట్ర నాయకులు కోలన్ శంకర్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా, మహా :** రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షులుగా నియామకం అయిన పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించిన బిజెపి రాష్ట్ర నాయకులు కోలన్ శంకర్ రెడ్డి, ఆయనకు గణేశుని ప్రతిమ అందజేశారు.



రాష్ట్ర నాయకత్వం ఇటీవల రంగారెడ్డి జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షులుగా నూతనంగా నియమించిన పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ని, ఆదివారం శంషాబాద్ లోని తన నివాసంలో, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలన్ శంకర్ రెడ్డి, మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారిని శాలువాతో సన్మానించి, మిఠాయి తినిపించి, గణేశుడి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా కోలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ సారిద్యంలో, రంగారెడ్డి జిల్లాలో భారతీయ జనతా పార్టీ ఒక తిరుగులేని శక్తిగా అవతరించబోతుందని ఆశ భావాన్ని వ్యక్తం చేశారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక ప్రజా ప్రతినిధులను, భారతీయ జనతా పార్టీ సాధించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో, బిజెపి జిల్లా సీనియర్ నాయకులు, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేటర్ లు మల్లేష్ ముదిరాజ్, కిసర్ల గోవర్ధన్ రెడ్డి, జిల్లెల అరుణ ప్రభాకర్ రెడ్డి, లతశ్రీ, జిల్లాకిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు రామిడి శేఖర్ రెడ్డి, రామిడి మహేందర్ రెడ్డి, బిజెపి నాయకులు మోతిలాల్, మంగపతి, పెద్దింటి సుధాకర్, మునగాల ప్రభాకర్ రెడ్డి, వీబీ లక్ష్మణ్ రాజ్, ఎన్ గోపాల్, విజయ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లోనూ గ్రీన్ బిల్డింగ్స్

పర్యావరణ అనుకూలమైన హరిత భవనాలకు ఆదరణ పెరుగుతోంది. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలే కాదు ప్రభుత్వం నిర్మించిన సచివాలయం, పోలీసు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, జిల్లా కలెక్టరేట్లు, ఇతరత్రా ఆఫీసు భవనాలు సైతం పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మిస్తుండటమే ఇందుకు ఉదాహరణ.. స్వచ్ఛమైన గాలి, వెలుతురు రావడంతో పాటు సహజ వనరులను వినియోగించుకోవడం, విద్యుత్, నీటి పొదుపు, సౌరశక్తి వినియోగం, గృహోపకరణాలు సైతం ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) అనుగుణంగా ఉండటమే హరిత భవనాల ప్రత్యేకత.

గ్రీన్ బిల్డింగ్స్‌లో 60 శాతం వరకు నీటి వృథాను అరికట్టవచ్చు. నిత్యావసరాలకు వినియోగించే నీరు బయటకు పంపకుండా వాటిని రీసైకిల్ చేసి తిరిగి మొక్కలు, బాత్‌రూమ్ అవసరాలకు వాడుకోవచ్చు. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి వర్షపు నీటిని నిల్వ చేస్తారు. సాధారణ భవనాలతో పోలిస్తే గ్రీన్ బిల్డింగ్స్‌లో నిర్మాణ వ్యయం 8-10 శాతం అధికంగా ఉంటుంది. కానీ.. ఈ భవనాలలో నీరు, విద్యుత్ పొదుపు అవుతున్న కారణంగా ఇంటి నిర్మాణం కోసం అదనంగా వెచ్చించిన వ్యయం 2-3 ఏళ్లలో తిరిగి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

ఇంటి నిర్మాణ సమయంలోనే రీసైకిల్ మెటీరియల్స్‌ను ఉపయోగించడం గ్రీన్ బిల్డింగ్స్ మరొక ప్రత్యేకత. పర్యావరణానికి హాని చేయని ఉత్పత్తులనే నిర్మాణంలో వాడుతుంటారు. ఇటుకల నుంచి టైల్స్ వరకు గ్రీన్ ఉత్పత్తులు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 720కి పైగా గ్రీన్ బిల్డింగ్ ప్రాజెక్టులు ఐజీబీసీ వద్ద రిజిస్టర్ అయ్యాయి. దేశవ్యాప్తంగా 11 వేల నిర్మాణాలు ఉన్నాయని ఐజీబీసీ ప్రతినిధులు చెబుతున్నారు.

# రూ.25 లక్షల వేతనం.. బెంగళూరులో కష్టం!

ఉద్యోగం చేయాలనుకునే చాలామంది.. ఢిల్లీ, ముంబై, బెంగళూరు లేదా హైదరాబాద్ వంటి నగరాలనే ఎంచుకుంటారు. అయితే బెంగళూరులో ఉండటం కష్టం అంటూ.. రూ.25 లక్షల వేతనం తీసుకునే ఓ కార్పొరేట్ ఉద్యోగి చెప్పిన మాటలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. దీని గురించి మరిన్ని వివరాలు ఇక్కడ తెలుసుకుందాం. ఒక కార్పొరేట్ ఉద్యోగి 40 శాతం ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగం కోసం పూణే నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యారు. అయితే ఓ సంవత్సరం గడిచాక, బెంగళూరుకు రావడం తప్పు అయిందని పశ్చాత్తాపపడ్డాడు. ఈ విషయాలు ప్రస్తుతం లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో వైరల్ అయ్యాయి. పూణేలో రూ. 18 లక్షల వేతనం వచ్చేది. బెంగళూరులో రూ. 25 లక్షలు వస్తున్నా ఏమీ మిగలడం లేదని, కొత్త ఉద్యోగంలో చేరి ఒక సంవత్సరం తర్వాత తన స్నేహితుడికి ఫోన్ చేసి తన నిరాశను వ్యక్తం చేశాడు కార్పొరేట్ ఉద్యోగి. నగరాలు మారకూడదు, పూణే చాలా బాగుందని అన్నాడు. కార్పొరేట్ ఉద్యోగి మాటలు విన్న, అతని ఫ్రెండ్ ఆశ్చర్యపోతూ.. 40 శాతం ఇంక్రిమెంట్ బాగానే ఉంది కదా. ఏమైంది అని అడిగితే.. బెంగళూరులో జీతాలు పెరిగేకొద్దీ ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. అద్దెలు మరీ ఎక్కువగా ఉన్నాయి. ఇంటి యజమానులు మూడు లేదా నాలుగు నెలల రెంట్ అడ్వాన్స్ తీసుకుంటున్నారు. ట్రాఫిక్ కూడా విపరీతంగా ఉంది. పూణేలోని 15 రూపాయల వడాపావ్ మిస్ అవుతున్నా అని చెప్పాడు. కనీసం అక్కడ జీవితం, సేవింగ్స్ అన్నీ బాగున్నాయి. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట్లో వైరల్ అవ్వడంతో నెటిజన్లు తమదైన రీతిలో స్పందిస్తూ.. తాము ఎదుర్కొన్న సొంత అనుభవాలను కూడా వెల్లడించారు. కొందరు బెంగళూరును సమర్థిస్తే.. మరికొందరు బెంగళూరులో బతకడం కష్టం అని అన్నారు.





## ఎక్కువ వడ్డీ అందించే పోస్టాఫీస్ స్కీమ్..
# ఎలా అప్లై చేయాలంటే?

మహిళలు, బాలికల కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల్లో 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' (MSSC) ఒకటి. ఈ పథకాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ 2023 జూన్ 27న ప్రారంభించింది. ఇది ఈ నెల చివరి నాటికి క్లోజ్ అవుతుందని తెలుస్తోంది. ఇంతకీ ఈ పథకానికి అర్హులు ఎవరు?, ఎలా అప్లై చేయాలి? అనే వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.

**MSSC స్కీమ్ కోసం ఎవరు అర్హులు**

- ఈ పథకం కోసం అప్లై చేసుకోవాలనుకునేవారు భారతీయులే ఉండాలి.
- ఈ స్కీమ్ కేవలం స్త్రీలకు మాత్రమే.
- వ్యక్తిగతంగా ఈ పథకానికి అప్లై చేసుకోవచ్చు. మైనర్ ఖాతా అయితే తండ్రి / సంరక్షకులు ఓపెన్ చేయవచ్చు.
- గరిష్ఠ వయోపరిమితి లేదు, కాబట్టి ఎవరైనా మహిళలు అప్లై చేసుకోవచ్చు.

**ఎలా అప్లై చేసుకోవాలి?**

- మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్ కోసం అప్లై చేసుకోవాలనుకునేవారు.. సమీపంలో ఉండే పోస్ట్ ఆఫీస్ బ్రాంచ్ లేదా ఈ పథకం ఉన్న బ్యాంకులో అప్లై చేసుకోవాలి.
- ముందుగా అధికారిక వెబ్‌సైట్ నుంచి ఫామ్ డౌన్‌లోడ్ చేసుకుని, అవసరమైన వివరాలను ఫిల్ చేసిన తరువాత.. కావలసిన డాక్యుమెంట్స్ జతచేయాల్సి ఉంటుంది.
- ఎంత డిపాజిట్ చేస్తారో దరఖాస్తులోనే వెల్లడించాలి (రూ. 1000 నుంచి రూ. 2 లక్షల వరకు).

**అప్లై చేయడానికి అవసరమైన డాక్యుమెంట్స్**

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకానికి అప్లై చేసుకోవడానికి.. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డిపాజిట్ చేసే మొత్తం లేదా చెక్, అడ్రస్ ప్రూఫ్ కోసం పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ వంటి డాక్యుమెంట్స్ అవసరం.

**పెట్టుబడి ఎంత పెట్టాలి? వడ్డీ ఎంత వస్తుంది**

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకంలో రూ. 1000 నుంచి రూ. 2 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఈ పథకం గడువు రెండేళ్లు. ఇందులో వడ్డీ 7.5 శాతం ఉంటుంది. అంటే మీరు ఇప్పుడు ఈ స్కీమ్ కింద ఇన్వెస్ట్ చేస్తే.. రెండు సంవత్సరాల తరువాత అసలు, వడ్డీ కలిపి తీసుకోవచ్చు. ఏదైనా అత్యవసర సమయంలో డిపాజిట్ మొత్తంలో 40 శాతం విత్‌డ్రా చేసుకోవచ్చు. ముందుగా విత్‌డ్రా చేసుకుంటే వడ్డీ రేటు తగ్గే అవకాశం ఉంటుంది.

# నీటి సంరక్షణలో ప్రముఖ సిమెంట్ కంపెనీ



ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా.. తాము దృష్టి సారించిన నీటి నిర్వహణ పద్ధతులు, ప్రభావవంతమైన పాలనా వ్యవస్థల ద్వారా బాధ్యతాయుతమైన నీటి నిర్వహణ పట్ల తమ నిబద్ధతను అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ వెల్లడించింది. అల్ట్రాటెక్ నీటి నిర్వహణ ప్రయత్నాలు.. యూనిట్ ప్రాంగణంలో, కంచెకు ఆవల ఉన్న ప్రాంతాలను.. అంటే కంపెనీ కార్యకలాపాలను నిర్వహించే ప్రాంతాలలోని కమ్యూనిటీలను సైతం చేరుకుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో వున్న అల్ట్రాటెక్ యొక్క ఇంటిగ్రేటెడ్ సిమెంట్ తయారీ యూనిట్, ఆంధ్రప్రదేశ్ సిమెంట్ వర్క్స్, నీటి సంరక్షణ పట్ల సమగ్ర విధానాన్ని కలిగి ఉంది. వారి నీటి సంరక్షణ కార్యక్రమాలలో ఒకటి వరుసగా నంద్యాల జిల్లా, అనంతపురం జిల్లాలోని పెట్నికోట, అయ్యవారిపల్లి గ్రామాలపై దృష్టి పెడుతుంది. ఇక్కడ తక్కువ వర్షపాతం, భూమి క్షీణత, అతి తక్కువ పంట ఉత్పాదకత వంటివి గ్రామీణ జీవనోపాధికి చాలా కాలంగా అడ్డంకులుగా ఉన్నాయి. ఫలితంగా, ఈ ప్రాంతంలో సమగ్ర వాటర్‌షెడ్ నిర్వహణ కార్యక్రమాలను అమలు చేయడానికి యూనిట్ 201920లో ఐదు సంవత్సరాల కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ రోజు వరకు.. ఆంధ్రప్రదేశ్ సిమెంట్ వర్క్స్ ఈ గ్రామాల్లో ఏడు వర్షపు నీటి ఇంకుడు గుంతల నిర్మాణాలను నిర్మించింది. ఇది భూగర్భజల స్థాయిలను గణనీయంగా పెంచుతుంది. ఈ నిర్మాణాలు 35,000 క్యూబిక్ మీటర్ల మొత్తం నీటి నిల్వ సామర్థ్యాన్ని సృష్టించాయి, జనవరి 2025 నాటికి 7 లక్షల క్యూబిక్ మీటర్ల వర్షపు నీటిని ఇవి సేకరించాయి. దీని వలన భూగర్భ జలాలు 2 నుంచి 4 మీటర్ల వరకు పెరిగాయి, దాదాపు 346 హెక్టార్ల సాగు భూమికి నీటిపారుదల లభించింది. గతంలో బంజరుగా ఉన్న 400 ఎకరాల భూమిని కూడా సాగులోకి తీసుకువచ్చారు, వ్యవసాయ ఉత్పాదకత, ఆదాయ భద్రతను పెంచారు. సమతుల్య పోషక వినియోగ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించే ప్రయత్నాలు ఈ గ్రామాల్లో నేల మరియు భూగర్భ జల కాలుష్యాన్ని తగ్గించడంలో కూడా సహాయపడ్డాయి. ఈ ప్రాజెక్ట్ నంద్యాల, అనంతపురం జిల్లాల్లోని ఈ రెండు గ్రామాల్లో నివసిస్తున్న 500 గృహాలలో 2,000 మందికి పైగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చింది.




## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# మరోమారు కాల్పుల కలకలం.. ముగ్గురు మృతి


**లాస్ క్రూసెస్:** అమెరికాలో మరోమారు కాల్పులు కలకలం రేపాయి. తాజాగా న్యూ మెక్సికో(New Mexico)లోని లాస్ క్రూసెస్ నగరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒక పార్కులో జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు మృతిచెందారు. 15 మంది గాయపడ్డారు. ఈ ఉదంతానికి సంబంధించిన వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందగానే పోలీసులు(Police) ఘటన జరిగిన యంగ్ పార్కుకు చేరుకున్నారు. పార్కులో ఒక కార్ షో జరిగింది. దానికి దాదాపు 200 హాజరయ్యారు. కాగా ఈ కార్ షోకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. లాస్ క్రూసెస్ పోలీస్ చీఫ్ జెరెమీ స్టోరీ మీడియాతో మాట్లాడుతూ పార్క్‌లో చెల్లాచెదురుగా 50 నుండి 60 షెల్ కేసింగ్‌లు కనిపించాయని, దీనిని చూస్తుంటే, చాలామంది తుపాకీలతో కాల్పులు జరిపినట్లు తెలుస్తున్నదన్నారు. పార్కులో రెండు గ్రూపుల మధ్య కాల్పులు జరిగివుండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కాల్పుల



ఘటనలో ముగ్గురు మృతిచెందారు. 15 మంది గాయపడ్డారు. మృతులంతా టీనేజర్లు(Teenagers). మృతులు, గాయపడిన వారి పేర్లను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. ఈ ఘటనలో గాయపడినవారిని ఆస్పత్రులకు తరలించినట్లు లాస్ క్రూసెస్ అగ్నిమాపక విభాగం చీఫ్ మైఖేల్ డేనియల్స్ తెలిపారు. లాస్ క్రూసెస్ నగర కౌన్సిలర్ జోహన్నా బెంకోమో, మేయర్ ప్రో టెం జోహన్నా బెంకోమో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ చేస్తూ, ఈ సంఘటనపై విచారాన్ని వ్యక్తం చేశారు.

# ట్రంప్ దెబ్బ అదుర్స్.. బైడెన్‌పై ప్రతీకారం





**వాషింగ్టన్:** అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకారం తీర్చుకున్నారు. ఆయనకు సెక్యూరిటీ క్లియరెన్స్ హోదాను రద్దు చేస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో తన ప్రత్యర్థి, మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, హిల్లరీ క్లింటన్‌తో పాటు బైడెన్ కుటుంబీకులకు, ఆయన యంత్రాంగంలో మంత్రులుగా, ఉన్నతాధికారులుగా పని చేసిన పలువురికి కూడా ఈ క్లియరెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మాజీ అధ్యక్షులు, మంత్రులు, అత్యున్నత స్థాయి అధికారులకు సెక్యూరిటీ క్లియ రెన్స్‌ను కొనసాగించడం ఆనవాయితీ. ఈ హోదా ఉండేవారికి వారికి ప్రభుత్వ నిఘా సమాచారం అందుతుంది. రహస్య పత్రాలు తదితరాలను చూసేందుకు కూడా వారికి అనుమతి ఉంటుంది. 2021లో బైడెన్ గద్దెనెక్కగానే ట్రంప్‌కు సెక్యూరిటీ క్లియరెన్స్ తొలగించారు. 2016-20 మధ్య అధ్యక్షుడైన ట్రంప్ ఆ ఎన్నికల్లో బైడెన్ చేతిలో ఓడటం, దాన్ని జీర్ణించుకోలేక క్యాపిటల్ హిల్ భవనంపై దాడికి తనవారిని ఉసిగొల్పడం తెలిసిందే. ఈ క్రమంలోనే.. బైడెన్.. 'తప్పుడు ప్రవర్తతో కూడిన ట్రంప్ వంటి వ్యక్తికి రహస్య, నిఘా సమాచారం అందుబాటులో ఉండటం సరికాదు. అందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నా' అని చెప్పారు. తాజాగా ట్రంప్ కూడా తన నిర్ణయానికి సరిగ్గా అవే కారణాలను చూపడం విశేషం. 'రహస్య పత్రాలు, సమాచారం బైడెన్ తదితరులకు అందుబాటులో ఉండటం దేశ ప్రయోజనాల రీత్యా క్షేమకరం కాదన్న నిర్ణయానికి వచ్చాను. అందుకే ఈ మేరకు ఆదేశాలిస్తున్నా' అంటూ ప్రకటించారు!.

# హత్య కేసులో నలుగురికి జైలు.. ఏడాదిన్నరకు తిరిగొచ్చిన 'మృతురాలు'


**భోపాల్:** చనిపోయిందని భావించి అంత్యక్రియలు పూర్తి చేశాక ఓ మహిళ సజీవంగా తిరిగిరావడంతో కుటుంబసభ్యులు షాక్‌కు గురయ్యారు. రాజస్తాన్ వాసికి తనను అమ్మేశారని, ఏడాదిన్నరపాటు అక్కడే ఉండి, చివరికి తప్పించుకుని వచ్చానని చెబుతోంది. అయితే, ఆమెను హత్య చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు వ్యక్తులు ప్రస్తుతం జైలులో ఉన్నారు. పలు ట్విస్టులున్న ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ జల్లాలో చోటుచేసుకుంది. లలితా బాయి అనే మహిళకు పెళ్లయి ఇద్దరు పిల్లలున్నారు. అయితే, షారుఖ్ అనే వ్యక్తితో జిల్లాలోని భాన్‌పుర పట్టణానికి వెళ్లిపోయింది. అక్కడ ఇద్దరూ రెండు రోజులున్నారు. లలితా బాయిని తీసుకెళ్లిన షారుఖ్.. రాజస్తాన్‌కు చెందిన షారుఖ్ అనే మరో వ్యక్తికి ఆమెను రూ.5 లక్షలకు అమ్మేశాడు. షారుఖ్ వెంట రాజస్తాన్‌లోని కోటా వెళ్లిన లలితా బాయి అక్కడ దాదాపు ఏడాదిన్నరపాటు గడిపింది. చివరికి తప్పించుకుని ఇటీవల సొంతూరులోని



తండ్రి రమేశ్ నానురాం దగ్గరికి చేరుకుంది. ఆమె సజీవంగా రావడంతో ఆశ్చర్యపోయిన తండ్రి వెంటనే పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. పోలీసులు ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డును, ఓటర్‌ఐడీని పరిశీలించి ఆమె చెప్పింది నిజమేనని తేల్చారు. కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. లలితా బాయి సజీవంగానే ఉన్నట్లు ధ్రువీకరించుకున్నారు. అయితే, లలితా బాయి కనిపించకపోవడంతో వెదుకుతున్న కుటుంబ సభ్యులకు గ్రామ పరిసరాల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఛిద్రమైన స్థితిలో కనిపించింది.

# దక్షిణ కొరియాలో బూడిదవుతున్న 20 అడవులు


**సియోల్:** అమెరికాలోని అడవుల్లో కార్చిర్చు రగలిన ఉదంతాలు మరువక ముందే ఇప్పుడు దక్షిణ కొరియా అడవుల్లో మంటలు చెలరేగాయి. మొత్తం 20కి పైగా అడవులు మంటల గుప్పిట్లో ఉన్నాయి. ఆగ్నేయ కొరియా ద్వీపకల్పంలో వ్యాపించిన మంటలు ఇతర ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. ఈ భారీ అగ్నిప్రమాదాల్లో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది మృతిచెందారు. దక్షిణ కొరియాలో తగలబడుతున్న అడవులకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో కార్చిచ్చు ఎంత తీవ్రంగా ఉందో గమనించవచ్చు.



దేశంలోని వివిధ ప్రాంతాలలోని అడవుల్లో వ్యాపించిన మంటలు అధికారులతో పాటు, స్థానికులను వణికిస్తున్నాయి. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది, సహాయక సిబ్బంది నిరంతరం ప్రయత్నిస్తున్నారు. బలమైన గాలులు మంటలు మరింతగా వ్యాపించడానికి కారణంగా నిలుస్తున్నాయి. దక్షిణ జియోంగ్‌సాంగ్ ప్రావిన్స్‌లో శుక్రవారం ప్రారంభమైన మంటలు శనివారం మధ్యాహ్నం నాటికి 275 హెక్టార్ల (680 ఎకరాలు) విస్తీర్ణంలోని అడవులను దహించివేసాయి. మంటలను అదుపు చేసే ప్రయత్నంలో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 200 మందికి పైగా ప్రజలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. సూర్యాస్తమయానికి ముందే మంటలను అదుపు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేయాలని దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్-మోక్ ఆదేశించారు. దక్షిణ కొరియా ప్రభుత్వం అగ్ని ప్రభావిత ప్రదేశాన్ని విపత్తు ప్రాంతంగా ప్రకటించింది.

# ఇండియా గేట్, రాష్ట్రపతి భవన్.. అంతటా అంధకారం.. కారణమిదే..

**న్యూఢిల్లీ:** దేశంలోని అన్ని చారిత్రక ప్రదేశాలకు ఉన్నట్టుండి ఒక్కసారిగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడాన్ని ఎప్పుడైనా చూశారా?. రాత్రివేళ ఎప్పుడూ కాంతులీనే ఈ ప్రాంతాల్లో అంధకారం అలముకుంటే ఎలా ఉంటుంది? ఇటువంటి దృశ్యం శనివారం కనిపించింది. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా ఎర్త్ అవర్ సెలబ్రేషన్ 2025 కింద ఈ విధంగా చారిత్రక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. శనివారం సాయంత్రం ఇండియా గేట్, ఎర్రకోట, రాష్ట్రపతి భవన్, విక్టోరియా మెమోరియల్, ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్.. ఇలా దేశవ్యాప్తంగా ఉన్న పలు చారిత్రక ప్రదేశాలలో లైట్లు ఆపివేశారు. ఈ ఏడాది 19వ ఎర్త్ అవర్(Earth Hour) ప్రపంచ జల దినోత్సవంతో పాటు జరిగింది. ఈ సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంగీతకారుడు, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా హోప్ అండ్ హార్మొనీ రాయబారి శంతను మొయిత్రా తన సంగీత ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఎర్త్ అవర్ సందర్భంగా రాత్రి 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు చారిత్రక ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణాలను ఆపివేయడం ద్వారా ఢిల్లీలో దాదాపు 269 మెగావాట్ల విద్యుత్తును ఆదా చేశారు. ఎర్త్ అవర్ అనేది విద్యుత్తును ఆదా చేసే ప్రచార కార్యక్రమం. ప్రజలు తమ దైనందిన జీవితంలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ప్రపంచంపై పడే భారాన్ని తగ్గించవచ్చని ఎర్త్‌డే చెబుతుంది. నీటిని ఆదా చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్(Singleuse plastic) వాడకాన్ని తగ్గించడం, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడం ద్వారా భూమిని కాపాడవచ్చని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఈ ప్రచారానికి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి. గత సంవత్సరం ఢిల్లీలో జరిగిన ఎర్త్ అవర్ సందర్భంగా 206 మెగావాట్ల విద్యుత్ ఆదా అయిందని పలు నివేదికలు చెబుతున్నాయి.





## హైదరాబాద్ చేరుకున్న డేవిడ్ వార్నర్.. ఐపీఎల్ మ్యాచ్ కోసం కాదు!

నితిన్, శ్రీలీల జంటగా నటించిన లేటేస్ట్ మూవీ రాబిన్‌హుడ్. ఈ మూవీకి వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఉగాది కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ నేపథ్యంలోనే మేకర్స్ ఇప్పటికే ప్రమోషన్స్‌తో అదరగొట్టేశారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు కాలేజీల్లో ఈవెంట్స్ నిర్వహించారు. అయితే మూవీ రిలీజ్ తేదీ దగ్గర పడడంతో రాబిన్‌హుడ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా ప్లాన్ చేశారు మేకర్స్. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ కూడా హాజరు కానున్నారు. ఈ ఈవెంట్ లో ముఖ్య అతిథిగా వార్నర్ పాల్గొననున్నారు. ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న వార్నర్‌కు ఘనస్వాగతం లభించింది. డైరెక్టర్ వెంకీ కుడుముల స్వయంగా పూల బొకే అందించి డేవిడ్‌కు వెల్‌కమ్ చెప్పారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే గతంలోనే ఈ సినిమాలో డేవిడ్ వార్నర్ నటిస్తున్నారని మేకర్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ రివీల్ చేశారు. ఈ మూవీ ద్వారా డేవిడ్ వార్నర్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. పుష్ప మేనరిజంతో అభిమానులను అలరించిన క్రికెటర్.. ఇప్పుడు ఏకంగా సినిమాతోనే ఫ్యాన్స్ ముందుకు రానున్నారు. ఈ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.


## కన్నప్పలో ఆ హీరోయిన్ తప్పుకోవడంతో అదృష్టం



కన్నప్ప సినిమాలోని 'సగమై - చెరి సగమై' పాటతో అందరి దృష్టినీ ఆకర్షించింది హీరోయిన్ ప్రీతి ముకుందన్. తమిళనాడుకు చెందిన ప్రీతి ముకుందన్ మలబార్ గోల్డ్, శరవణన్ స్టోర్స్, చెన్నై సిల్క్స్ వంటి సంస్థల కమర్షియల్ యాడ్స్‌లో మోడల్‌గా నటించింది. తండ్రి గోపాల్ ముకుందన్ వ్యాపారవేత్త. తల్లి చెన్నైలో డెంటిస్ట్‌గా ప్రాక్టీసు చేస్తోంది. తల్లి ప్రోత్సాహంతోనే చిన్నప్పటి నుంచి యాక్టింగ్ మీద ఆసక్తి పెంచుకుంది. తల్లే దగ్గరుండి భరతనాట్యం నేర్పించి, ప్రదర్శనలు ఇప్పించింది. ప్రీతియే కాదు తల్లి కూడా నటించింది! తల్లికి యాక్టింగ్ పట్ల ఎంత ఇష్టమంటే కన్నప్ప సినిమాలో ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తే, తల్లి కూడా ఓ క్యారెక్టర్‌లో నటించింది. నటి లక్ష్మి కుమార్తె, ఒకనాటి హీరోయిన్ ఐశ్వర్య.. ప్రీతి ముకుందన్ తల్లి కాలేజీలో క్లాస్‌మేట్స్. న్యూజిలాండ్‌లో కలుసుకున్నప్పుడు ఇద్దరు స్నేహితురాళ్ళు ఎంతో థ్రిల్ ఫీలయ్యారు. కాలేజీ కబుర్లు నెమరేసుకున్నారు. 2001 జులై 30 సోమవారం నాడు పుట్టింది ప్రీతి ముకుందన్. సోమవారం శివుడికి అత్యంత ప్రీతి పాత్రమైన రోజు. అయితే, శివ భక్తుడు కన్నప్ప మీద తీస్తున్న సినిమాలో హీరోయిన్ గా అవకాశం వచ్చినట్లే వచ్చి పోయింది.

**ఆ హీరోయిన్ తప్పుకోవడం వల్ల..**

కన్నప్పలో హీరోయిన్ క్యారెక్టర్ ఆడిషన్‌కి ప్రీతి ముకుందన్ వచ్చింది. కానీ, నుపూర్ సనన్‌ని హీరోయిన్‌గా సెలెక్ట్ చేశారు. కన్నప్ప సినిమా ఓపెనింగ్‌లో కూడా నుపూర్ సనన్ పాల్గొంది. అప్పుడు ఎంతో బాధ పడినట్లు ప్రీతి ముకుందన్ చెప్పింది. అయితే తర్వాత నుపూర్ సినిమా మానేయడంతో- మళ్ళీ హీరోయిన్ చాన్స్ ప్రీతి ముకుందన్‌ను వెతుక్కుంటూ వచ్చింది. ఆ శివుడే తనకు ఈ అవకాశం ఇచ్చాడని ప్రీతి నమ్మకం.




## ఓటీటీలో 25 ఏళ్ల తర్వాత స్ట్రీమింగ్ అవుతున్న సినిమా

సుమారు 25 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలో విడుదల కానుంది. 2000 ఏడాదిలో థియేటర్స్‌లో రిలీజ్ అయిన హాలీవుడ్ మూవీ 'మలేనా' ఓటీటీ ప్రియుల కోసం రానుంది. లూసియానో విన్సెంజోని కథ నుండి గియుసేప్ టోర్నాటోర్ రచించి దర్శకత్వం వహించిన ఈ శృంగార నాటక చిత్రం అప్పట్లో సంచలనం రేపింది. 73వ అకాడమీ అవార్డ్స్ లో సత్తా చాటిన మలేనా.. బాక్సాఫీస్ వద్ద ఆరోజుల్లోనే రూ. 150 కోట్ల కలెక్షన్స్ రాబట్టి రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రం రెండు విభాగాల్లో ఆస్కార్‌కు కూడా నామినేట్ అయింది. 'మలేనా' చిత్రం సడెన్‌గా అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే, ఈ మూవీ చూడాలంటే రూ. 99 అద్దె చెల్లించాల్సి ఉంటుంది. మార్చి 29 నుంచి ఉచితంగా స్ట్రీమింగ్ కానున్నట్లు సమాచారం. టైటిల్ పాత్రలో ఇటాలియన్ నటి మోనికా బెల్లూచి (Monica Bellucci) కనిపిస్తుంది. ఆమె ఒక ఆర్మీ ఆధికారి భార్యగా అద్భుతంగా నటించిందని చెప్పవచ్చు. 12 ఏళ్ల బాలుడి రెనాటో పాత్రలో గియుసేప్ సల్ఫారో (Giuseppe Sulfaro) మెప్పించాడు. సినిమా మొత్తం వీరిద్దరి మధ్య జరిగే ఆర్షణ, ప్రేమ చుట్టూ ఉంటుంది. ఒక అందమైన అమ్మాయి ఒంటరిగా జీవిస్తుంటే ఈ సమాజం ఏ విధంగా చిత్రీకరిస్తుంది అనేది ప్రధాన కాన్సెప్ట్‌తో ఈ మూవీని తెరకెక్కించారు.



## సర్వం.. కీరవాణి స్వరమయం

ఆస్కార్ అవార్డ్ గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి నిర్వహించిన కన్సర్ట్.. హైదరాబాద్ లో శనివారం రాత్రి వేడుకగా జరిగింది. హైటెక్స్ గ్రౌండ్ లో దాదాపు 10 వేల మంది ఆహుతుల ఈ ప్రోగ్రామ్ చూసి ఎంజాయ్ చేశారు. దాదాపు మూడు గంటల పాటు ఈ కార్యక్రమం జరిగింది. ఇటీవలే ఒడిశాలో షూటింగ్ ముగించుకుని వచ్చేసిన రాజమౌళి.. 'నా టూర్ ఎమ్ఎమ్ కే' పేరుతో నిర్వహించిన ఈ కన్సర్ట్ లో పాల్గొన్నారు. ఇకపోతే ఈ సంగీత కార్యక్రమంలోనే కీరవాణి.. తన స్వరపరిచిన బాహుబలి, ఆర్ఆర్ఆర్ చిత్ర గీతాలని ఆలపించారు. ఈయనతో పాటు 83 మంది సింగర్స్-టెక్నీషియన్స్ కన్సర్ట్ జరిగే ప్రాంతాన్ని సంగీతమయం చేశారు. ఈ కన్సర్ట్ ని నా జీవితంలో మర్చిపోనని కీరవాణి చెప్పకొచ్చారు.

# క్రీడా వార్తలు | SPORTS NEWS



## చరిత్ర సృష్టించిన సన్‌రైజర్స్

- రాజస్తాన్‌పై సన్‌రైజర్స్ ఘన విజయం
- ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీ..

ఐపీఎల్2025ను సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుతమైన విజయంతో ప్రారంభించింది. ఉప్పల్ వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 44 పరుగుల తేడాతో ఎస్ఆర్‌హెచ్ గెలుపొందింది. 287 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్ 6 వికెట్లు కోల్పోయి 242 పరుగులు మాత్రమే చేయగల్గింది. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో సిమర్జీత్ సింగ్, హర్షల్ పటేల్ తలా రెండు వికెట్లు పడగొట్టగా.. షమీ, జంపా చెరో వికెట్ సాధించారు. రాజస్తాన్ బ్యాటర్లలో ధ్రువ్ జురెల్(70) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్‌హెచ్ 6 వికెట్ల నష్టానికి 286 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే రాజస్తాన్ బౌలర్లను సన్‌రైజర్స్ బ్యాటర్లు ఊచకోత కోశారు. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ బంతిని స్టాండ్స్‌కు తరలించాడు. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో ఇషాన్ కిషన్ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. కేవలం 47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లతో 106 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇషాన్‌కు ఇదే తొలి ఐపీఎల్ సెంచరీ కావడం గమనార్హం. కాగా ఐపీఎల్2025 మెగా వేలంలో కిషన్‌ను రూ.11.25 కోట్లకు ఎస్ఆర్‌హెచ్ కొనుగోలు చేసింది. కిషన్‌తో పాటు ట్రావిస్ హెడ్(67), క్లాసెన్(34), నితీశ్ కుమార్(30) పరుగులతో రాణించారు. రాజస్తాన్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే మూడు వికెట్లు పడగొట్టగా.. థీక్షణ రెండు, సందీప్ శర్మ ఒక్క వికెట్ సాధించారు. ఇక ఈ మ్యాచ్‌లో భారీ స్కోర్ చేసిన సన్‌రైజర్స్ ఓ అరుదైన రికార్డును తమ పేరిట లిఖించుకుంది.

### ఎస్ఆర్‌హెచ్ వరల్డ్ రికార్డు

టీ20 క్రికెట్‌లో అత్యధిక సార్లు 250 ప్లస్ స్కోర్లు సాధించిన తొలి జట్టుగా ఎస్ఆర్‌హెచ్ వరల్డ్ రికార్డు సృష్టించింది. సన్‌రైజర్స్ ఇప్పటివరకు 4 సార్లు 250 పైగా పరుగులు చేసింది. ఇంతకుముందు రికార్డు ఇంగ్లండ్ క్రికెట్ క్లబ్ సర్రే పేరిట ఉండేది. సర్రే 3 సార్లు 250 ప్లస్ స్కోర్లు నమోదు చేసింది. తాజా మ్యాచ్‌తో సర్రే ఆల్‌టైమ్ రికార్డును కమ్మిన్స్ సేన బ్రేక్ చేసింది. అదేవిధంగా ఐపీఎల్ చరిత్రలో ఇది రెండో అత్యధిక స్కోర్ కావడం గమనార్హం.


## ఐపీఎల్-2025లో బోణీ కొట్టిన సీఎస్‌కే.. ముంబైపై విక్టరీ

ఐపీఎల్2025ను చెన్నై సూపర్ కింగ్స్ అద్భుతమైన విజయంతో ఆరంభించింది. చెపాక్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్ విజయం సాధించింది. 156 పరుగుల లక్ష్యాన్ని సీఎస్‌కే 6 వికెట్లు కోల్పోయి 19.1 ఓవర్లలో చేధించింది. చెన్నై బ్యాటర్లలో రచిన్ రవీంద్ర(65 నాటౌట్), రుతురాజ్ గైక్వాడ్(53) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఓ దశలో వరుస క్రమంలో వికెట్లు కోల్పోయినప్పటికి.. రవీంద్ర మాత్రం ఆచితూచి ఆడుతూ మ్యాచ్‌ను ముగించాడు. ముంబై బౌలర్లలో విఘ్నేష్ మూడు వికెట్లు పడగొట్టగా.. దీపక్ చాహర్, జాక్స్ తలా వికెట్ సాధించారు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. ముంబై బ్యాటర్లలో తిలక్ వర్మ(31) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ఆఖరిలో దీపక్ చాహర్(28) కీలక ఇన్నింగ్స్ ఆడారు. రోహిత్ శర్మ(0) ఈ మ్యాచ్‌లో నిరాశపరిచాడు. ఇక సీఎస్‌కే బౌలర్లలో నూర్ అహ్మద్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. ఖాలీల్ అహ్మద్ మూడు వికెట్లు సాధించాడు.



## వారెవ్వా ధోని.. కేవలం 0.12 సెకన్లలోనే!

ఎంఎస్ ధోని.. ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ వికెట్ కీపర్ బ్యాటర్లలో ఒకడిగా పేరు సంపాదించుకున్నాడు. ఈ జార్ఖండ్ డైనమేట్.. విధ్వంసకర బ్యాటింగ్‌తో పాటు అద్భుతమైన వికెట్ కీపింగ్ స్కిల్స్‌కు పెట్టింది పేరు. తాజాగా ధోని మరోసారి తన కీపింగ్ స్కిల్స్‌తో అభిమానులను అలరించాడు. ఐపీఎల్2025లో చెపాక్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సీఎస్‌కే తరపున ఆడుతున్న ధోని.. అద్భుతమైన స్టంపింగ్‌తో మెరిశాడు. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను మెరుపు స్టంప్ ఔట్ చేసి ధోని పెవిలియన్‌కు పంపిచాడు.




**అసలేమి జరిగిదంటే?**


ముంబై ఇన్నింగ్స్ 11 ఓవర్ వేసిన లెగ్ స్పిన్నర్ నూర్ అహ్మద్.. మూడో బంతిని సూర్యకు గూగ్లీగా సంధించాడు. ఆ బంతిని సూర్యకుమార్ క్రీజు నంచి బయటకు వచ్చి షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ బంతి అద్భుతంగా టర్న్ అయ్యి అతడి బ్యాట్‌ను మిస్ అయ్యి వికెట్ల వెనక ఉన్న ధోని చేతికి వెళ్లింది. ఈ క్రమంలో మిస్టర్ కూల్.. తన వింటేజ్ స్టైల్‌లో రెప్పపాటులో బెయిల్స్‌ను పడగొట్టాడు. ఫీల్డ్ అంపైర్ థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేసినప్పటికి.. సూర్య మాత్రం కనీసం వెనక్కి తిరగకుండా మైదానం విడిచివెళ్లిపోయాడు. ధోని కేవలం 0.12 సెకండ్ల వ్యవధిలోనే స్టంప్ ఔట్ చేయడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. ముంబై బ్యాటర్లలో తిలక్ వర్మ(31) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ఆఖరిలో దీపక్ చాహర్(28) కీలక ఇన్నింగ్స్ ఆడారు. సీఎస్‌కే బౌలర్లలో నూర్ అహ్మద్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. ఖాలీల్ అహ్మద్ మూడు వికెట్లు సాధించాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# రేషన్ కార్డు ఉంటేనే రాజీవ్ యువ వికాసం స్కీం వర్తింపు

- కొత్త రేషన్ కార్డుల కోసం పాత కార్డులు డిలీట్ చేసుకున్న లబ్ధిదారులు
- ఎలక్షన్ కోడ్ తరువాత వారంలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామనడంతో పాతవి డిలీట్
- ఉపాధి స్కీం కు అనర్హులుగా రేషన్ కార్డులు లేని వారు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు




**ములుగు, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాసం స్కీంకు రేషన్ కార్డు జారీ తలనొప్పిగా మారింది. ఉపాధి అవకాశాలను కల్పించేందుకు 5లక్షల మందికి రూ.1లక్ష నుంచి రూ.4లక్షల వరకు ప్రభుత్వం నాలుగు రకాల సబ్సిడీ రూపంలో పథకాన్ని రూపొందించి జీవో విడుదల చేసింది. అర్హులైన లబ్ధిదారులను ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు. ఏడు విభాగాల్లో ఎంచుకున్న సబ్ స్కీంలకు రుణాలు మంజూరు చేయనున్నారు. పేరు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు నెంబర్లను జత చేయాల్సి ఉంటుంది. రేషన్ కార్డు లేని వారికి ఈ స్కీం వర్తించదు. దీంతో లబ్ధిదరులకు కొత్త తలనొప్పి వచ్చింది. ఎంతో మంది నిరుద్యోగ యువత ఏదో ఒక ఉపాధి అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి ఆన్లైన్ సెంటర్లు, మీసేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు.

**రేషన్ కార్డులు లేకుంటే రాజీవ్ యువ వికాసం లేనట్లే..**

రాజీవ్ యువ వికాసం స్కీం ద్వారా అర్హులైన లబ్ధిదారులు ఆన్ లైన్ చేసుకోవాలంటే రేషన్ కార్డులు తప్పనిసరిగా చూపిస్తోంది. ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు రేషన్ కార్డు నెంబరును తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఆధార్ కార్డులకు రేషన్ కార్డులను అనుసంధానం చేసిన ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం స్కీంలో ఆధార్ నెంబరును నమోదు చేయడంతో ఒకవేళ రేషన్ కార్డు లేకుంటే స్కీం కు వర్తించరు అని చూపిస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం కొత్త రేషన్ కార్డులు వస్తాయనే ఆశాభావంతో పెళ్లి అయిన జంటలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొందరు తల్లిదండ్రుల నుంచి విడిగా రేషన్ కార్డు కోసం అప్లై చేసుకున్నారు. అయితే ఆన్లైన్, మీసేవా నిర్వాహకులు పాతవాటిలో పేర్లు డిలీట్ చేస్తేనే కొత్త వాటికి పేర్లు నమోదు అవుతాయని చెప్పడంతో తమ పేర్లను రిమూవ్ చేసుకొని కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కొత్త రేషన్ కార్డులను ఇవ్వకపోవడంతో రాజీవ్ యువ వికాసం స్కీంకు కొందరు అర్హులైన నిరుద్యోగులు కూడా అనర్హులుగా ప్రకటించబడుతున్నారు. ప్రభుత్వ తీరుపై యువత అసహనం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా రేషన్ కార్డు లింకేజీ తొలగించాలని, లేనిపక్షంలో వెంటనే కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఏడు విభాగాల్లో రాజీవ్ యువ వికాసం లోన్లు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టింది. అందులో అగ్రికల్చర్, ఆగ్రో బేస్డ్, యానిమల్ హస్బండరీ, హార్టీకల్చర్, ఇండస్ట్రియల్ సర్వీస్ బిసినెస్, మైనర్ ఇరిగేషన్, ట్రాన్స్ పోర్ట్ సెక్టార్ లలో ఒక్కో విభాగంలో సబ్ కేటగిరీలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఎంపిక చేసుకున్న విభాగాలను బట్టి లోన్ ఇస్తారు. బ్యాంకు లింకేజీ ద్వారా లోన్లు ఇస్తూ 80శాతం వరకు సబ్సిడీ కూడా అందుబాటులో ఉంది. దీంతో నిరుద్యోగ లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవడానికి క్యూలు కడుతున్నారు. అయితే రేషన్ కార్డు ఉన్నవారికే ఈ పథకం వర్తిస్తుండటంతో లబ్దిదారుల్లో ఆందోళన మొదలైంది. తెలంగాణ ప్రభుత్వం పునరాలోచించి రేషన్ కార్డు నిబంధన తొలగించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# ఎరుకల నాంచారమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తాం

**తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు**




**ములుగు, మహా :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామంజపురం గ్రామపంచాయతీ పరిధిలో గల పొలాల మధ్య ఉన్న ఎరుకల నాంచారమ్మ జాతరను వైభవంగా నిర్వహించుకుందామని తెలంగాణ ఆదివాసీ ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు అన్నారు. ఆదివారం వెంకటాపూర్ మండలంలోని రామంజాపురం గ్రామంలో శిథిల వ్యవస్థలో ఉన్న శివలింగాలను పరిశీలించారు. అనంతరం నాంచారమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ 800లసంవత్సరాల క్రితం నాంచారమ్మ పంచకూటాలయాన్ని రామంజపూర్ గ్రామ పరిధిలో పొలాల మధ్య గుడిని నిర్మించారని, రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు, రైతులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకుంటున్నామని అన్నారు. ఇప్పుడు ఆగుడిని అక్కడ నుంచి తీసేసి శిల్పాలను ఎక్కడెక్కడో పడవేశారని, వెంటనే ఆశిల్పాలను తీసుకువచ్చి వెంటనే గుడిని పునర్మించాలని కోరారు. గుడి చుట్టూ కాంపౌండ్ వాల్, శాశ్వత రోడ్డు నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ కుల ఆరాధ్య దైవమైన నాంచారమ్మ దేవాలయాన్ని ఆ ప్రాంతంలో ఎరుకల కులస్తులు అంగరంగ వైభవంగా 8సంవత్సరాల నుంచి జాతర నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనేటి రాజు, కేతిరి రాజశేఖర్, ములుగు జిల్లా అధ్యక్షుడు కేతిరి బిక్షపతి, ప్రధాన కార్యదర్శి పల్లకొండ భాస్కర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కేతిరి సుభాష్, అంగిడి ప్రశాంత్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మానుపాటి రమేష్, పాలకుర్తి శ్రీనివాస్, ములుగు జిల్లా కోశాధికారి పాలకుర్తి సురేష్, కరీంనగర్ జిల్లా కూతాటి శ్రీనివాస్, మానుపాటి మల్లేష్, మంచిర్యాల జిల్లా దుగ్యాల బాబు, లోకిని రవి, చిట్యాల దుగ్యాల రమేష్, ప్రభాకర్ పాలకుర్తి పోషయ్య, రేగొండ మల్లయ్య తదితరులు ఉన్నారు.

# జాన్ పహాడ్ దర్గాని దర్శించుకున్న రాష్ట్ర మంత్రులు



**హుజూర్ నగర్,మహా :** జాన్ పహాడ్ దర్గాలో రాష్ట్ర మంత్రులు ఆదివారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజ గోపాల్ రెడ్డి దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి , ముస్లిం మత పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పన్నులు చెల్లించండి నగర అభివృద్ధికి తోడ్పడండి



**వరంగల్, మహా :** పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే నేడొక ప్రకటన లో నగర ప్రజలను కోరారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ 2024 25 ఆర్థిక సంవత్సరపు పన్నులు చెల్లించడానికి కేవలం 8 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, నగరావాసుల సౌకర్యార్థం గ్రేటర్ వరంగల్ నగర పరిధి లో ఉన్న 10 ఈసేవా కేంద్రాలైన కాజీపేట సర్కిల్ కార్యాలయం, సుబేదారి వాటర్ ట్యాంక్, హన్మకొండ నక్కలగుట్ట వాటర్ ట్యాంక్, హన్మకొండ అశోకా హోటల్ ఎదురుగా గల మీ సేవాకేంద్రం, హన్మకొండ నయింనగర్ , హన్మకొండ బల్దియా ప్రధాన కార్యాలయం, వరంగల్ పోచమ్మమైదాన్ ఈ సేవా, వరంగల్ కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం, వరంగల్ హెడ్ పోస్టాఫీసు, వరంగల్ కరీమాబాద్ ఈ సేవా కేంద్రం,వరంగల్ లతో పాటు మై జీ డబ్ల్యు ఎం సి యాప్ ద్వారా గాని www.gwmc.gov.in ద్వారా గాని క్యూ ఆర్ కోడ్ ద్వారా గాని మీ సమీపం లో గల మీ సేవా కేంద్రాల్లో, వార్డ్ ఆఫీసర్లకు పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. సుదీర్ఘ కాలం గా పన్నులు చెల్లించని వారికి ఇప్పటికే రెడ్ నోటీసులు అందించి ఆస్తులను జప్తు చేస్తున్నామని, రెసిడెన్షియల్ , కమర్షియల్ పన్ను చెల్లింపు దారులు వెంటనే పన్నులు చెల్లించాలని, లేనిచో పన్నులు చెల్లించని వారి ఆస్తులని సీజ్ చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

# జిల్లాలో నిరుద్యోగ నిర్మూలన కోసం కృషి చేస్తా




**హన్మకొండ మహా :** నాయిని విశాల్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నిర్వహించారు. ప్రముఖ దిగ్గజ సంస్థ ఫాక్స్ కాన్ సంస్థ నేతృత్వంలో నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరించారు. హనుమకొండ జిల్లా నిరుద్యోగ యువతి,యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం రోజున హనుమకొండ వాగ్దేవి కాలేజ్ ఆవరణలో నాయిని విశాల్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ దిగ్గజ సంస్థ ఫాక్స్కాన్ నేతృత్వంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ మహిళలకు ప్రజా ప్రభుత్వంలో పెద్దపీట వేయడం జరిగిందని,ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేస్తుందన్నారు.కొత్త ఉద్యోగాల కల్పనకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుందని వెల్లడించారు. ప్రభుత్వేతర ఉద్యోగాల భర్తీకి స్థానిక యువతకు ఉద్యోగ కల్పన అవకాశాలు కల్పించేందుకు విశాల్ రెడ్డి ట్రస్ట్ ద్వారా నాన్ ఐటీ ఉద్యోగాల భర్తీకి హైదరాబాద్ లోని ప్రముఖ మ్యానుఫ్యాక్చర్ సంస్థతో మొదలు మహిళా నిరుద్యోగ యువతులకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.రానున్న రోజుల్లో ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఉపాధి అవకాశాల కల్పనపై దృష్టి సారించి ప్రముఖ కంపెనీలతో జాబ్ మేళలను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# ముస్లింల రక్షణ, అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నాం

- మా ప్రభుత్వం అన్ని మతాలకి సమాన ప్రాధాన్యతనిస్తుంది
- రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి
- నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్ నగర్, మహా :** ముస్లింల రక్షణ, అభివృద్ధి, సంక్షేమం కొరకు కృషి చేస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్నగర్ ఉస్మానియా మసీద్ నందు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నపుడే హుజూర్నగర్ నందు షాదిఖానా నిర్మించానని,ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హుజూర్నగర్ నియోజకవర్గం లో మేళ్లచెర్వు, రామాపురం, పెద్దవీడు, రఘునాథపాలెం, నేరేడుచర్ల అలాగే కోదాడ పట్టణం లో షాదిఖానా లు మంజూరు చేశామని తెలిపారు. మా ప్రభుత్వం అన్ని మతాలకి సమాన ప్రాధాన్యతనిస్తూ అన్ని మతాల ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ పవిత్ర రంజాన్ మాసం ప్రార్థన లో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని అల్లా దీవెనలతో మీ జీవితాలు ఉన్నత స్థాయి కి ఎదగాలని కోరుకుంటున్నాని తెలిపారు. తదుపరి కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి తో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోదాడ లోని జబ్బార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం మిత్రులతో కలిసి మసీదులో ప్రార్థనలు చేయటం చాలా ఆనందంగా ఉందని,ఎన్నో ఏళ్లుగా నా గెలుపులో కుటుంబ సభ్యులుగా వెన్నువెంటున్న ప్రతి ఒక్కరికి తోడుగా ఉంటానని అన్నారు హుజూర్నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఉపవాసం ఉంటున్న ముస్లిం మిత్రులందరికీ ముందుగా పవిత్ర రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు.వక్ఫ్ బోర్డు బిల్లు త్వరలో పార్లమెంట్లో ప్రవేశపెడతాం. నా ప్రియమిత్రుడు కోదాడ జబ్బార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశంలో అన్ని కులాలు, అన్ని మతాలు అన్నదమ్ముళ్ల కలిసి ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ లు నాగార్జునరెడ్డి, వాజీద్,ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పన్ను వసూళ్ల తీరును పరిశీలించిన కమిషనర్



**వరంగల్, మహా :** గ్రేటర్ వరంగల్ నగరంలో పన్నుల చెల్లింపుల తీరును కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి పన్నులు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. పన్నుల చెల్లింపునకు ఈ నెల చివరి తేదీ గడువు ఉన్న నేపథ్యం లో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలన్న సి డి ఎం ఏ ఆదేశాల మేరకు నగరం లోని మండి బజార్ వరంగల్ చౌరస్తా స్టేషన్ రోడ్ హంటర్ రోడ్ ఖాజీపేట ప్రాంతాల్లో పన్ను వసూళ్ల తీరును కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవడానికి కాజీపేట సర్కిల్ పరిధిలో 6 కాశీబుగ్గ సర్కిల్ పరిధిలో 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పన్ను వసూళ్ల తీరును పర్యవేక్షించడం జరుగుతుందని ప్రాపర్టీలు చెల్లించని బడా బకాయి దారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు అందించడం జరిగిందని పన్నులు చెల్లించని పక్షంలో వారి ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందని చాలా కాలం నుండి పన్నులు చెల్లించని గృహ యాజమాన్యాలకు నోటీసులు అందజేయడం జరిగిందని అయినను పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు అందజేసి ఆస్తులు జప్తు చేస్తామని కావున ప్రజలు బల్దియాకు సహకరించి నిర్దిష్ట గడువులోగా పన్నులు చెల్లించాలని కమిషనర్ నగర ప్రజలను కోరారు.

# సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన హోం మంత్రి అనిత





**అనకాపల్లి జిల్లా ,నక్కపల్లి,మహా :** పాయకరావుపేట నియోజకవర్గంలో పేదలకు హోం మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి క్యాంప్ కార్యాలయం వద్ద సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పేదలకు వైద్య సాయంగా మంత్రి ఈ చెక్కులను అందజేశారు. అభివృద్ధి, సంక్షేమం దిశగా ఎన్డీయే కూటమి పాలన అందిస్తుందని హోం మంత్రి అనిత అన్నారు.చెక్కులు పొందిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. కారే సోమోరమ్మ 3లక్షల 808 రూపాయలు , కోడ జగన్నాథం 37 వేల 100 రూపాయలు , సత్యనారాయణ 59 వేల 602 రూపాయలు కోనేటి రాజేంధ్ర 48 వేల795 రూపాయల చొప్పున మడదా వెంకటరమణ (1,22,558) నాగం జష్మీత (73,469)పి.వెంకటరమణమ్మ (2,65,000) (యస్ సత్యవతి (2,56,354) టి రాజేశ్వరి (81,000) వై ప్రభావతి (37,205) టి చిరంజీవి ( 5,00,000) బి చక్రరావు ( 69,358) బి దుర్గా ( 30,000) బి సత్యవతి ( 81,000) బి అప్పలనర్స ( 2,17,429) జీ నూకరాజు ( 1,03,296)సిహెచ్ గణేష్ ( 41,084)జీ ఈశ్వరరావు ( 91,096)జీ శ్రీను (41,200) జీ సింహాచలం 88 వేల 916 రూపాయల చెక్కులను అందజేశారు.

# అనితమ్మ క్రికెట్ టోర్నమెంట్ లో రాజయ్యపేట జట్టు విజయం

**రన్నర్స్ గా పాయకరావుపేట టీమ్**





**అనకాపల్లిజిల్లా, నక్కపల్లి, మహా :** రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పుట్టినరోజు సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ లో రాజయ్యపేట నూకతాత టీమ్ విన్నర్ గా ,పాయకరావుపేట క్రికెట్ లవర్స్ జట్టు రన్నర్ గా నిలిచాయి. 12 రోజులుగా జరిగిన ఈ క్రికెట్ టోర్నీలో 50 జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. పాయకరావుపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి సుమారు 750 మంది క్రీడాకారులు ఈ టోర్నమెంట్ లో పాల్గొన్నారు. మొదటి బహుమతి లక్ష రూపాయలు,ద్వితీయ బహుమతి యాభై వేల రూపాయలు రేపు హోం మంత్రి చేతుల మీదగా విజేతలు అందుకోనున్నారు. బెస్ట్ బ్యాట్స్ మ్యాన్ బూషన్ ,బెస్ట్ బౌలర్ పైడిరాజు అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరిస్ కూడా పైడిరాజు కైవసం చేసుకున్నారు.విజేతలకు హోం మంత్రి అనిత శుభాకాంక్షలు తెలిపారు.ఫైనల్ మ్యాచ్ ను వీక్షించిన హోం మంత్రి అనిత,క్రికెట్ గ్రౌండ్ లో బ్యాటింగ్ చేసి సందడి చేసారు.

# పేషంట్స్ పూర్తిస్థాయిలో కోలుకునేందుకు రిహబ్ సెంటర్స్ ఎంతో దోహదపడతాయి



**ఎల్బీనగర్,మహా:** ప్రభుత్వ హాస్పిటల్ లతో పాటు ప్రైవేట్ రంగంలో ఉన్న హాస్పిటల్ లు సెకండరీ లెవెల్ చికిత్స పొందిన తర్వాత అదే రకమైన చికిత్సను అందించేందుకు రిహాబిలిటేషన్ సెంటర్ లు ఉపయోగపడుతాయని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వనస్థలిపురం లోని ఆయుష్మాన్ న్యూరో రిహాబిలిటేషన్ సెంటర్ ను ఐటి శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై ఆదివారం ప్రారంబించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏదైనా చికిత్స కొరకు డాక్టర్ వద్దకు వెళ్ళినప్పుడు రోగి తిరిగి ఆరోగ్యకరంగా ఇంటికి వెళ్లేలా చేస్తున్న రిహాబిలిటేషన్ సెంటర్ లు ఉపయోగపడుతాయన్నారు.హాస్పిటల్ కు వచ్చే రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం అందించాలని వైద్యులను కోరారు.రిహాబిలిటేషన్ సెంటర్ న్యూరో వైద్యులు జివికేఆర్ గౌడ్ మాట్లాడుతూ పెరాలసిస్ వచ్చిన వారికి ,కాళ్లు చేతులు పనిచేయని వారు రోడ్ ప్రమాదంలో తలకు గాయమై ఆపరేషన్ అయినవారికీ రిహాబిలిటేషన్ సెంటర్ లో వైద్యం అందించడం జరుగుతుందన్నారు.

# స్నేహితున్ని వేటాడి గొడ్డళ్లతో నరికి చంపారు

- హైదరాబాద్ ఎల్బీనగర్ లో పాత కక్షల నేపథ్యంలో యువకుడి హత్య
- కారుతో ఢీ కొట్టి తర్వాత గొడ్డళ్ల వేట కొడవళ్లతో దాడి
- పోలీస్ లు అదుపులో నిందితులు



**ఎల్బీనగర్, మహా:** వాళ్లంతా ఒకప్పుడు మంచి స్నేహితులు అందరూ కలిసి వెళ్లిన పెళ్లి వేడుకలో శత్రువులుగా మారారు.దీంతో అందులో ఓ స్నేహితున్ని పాత కక్షల నేపథ్యంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారుతో ఢీ కొట్టి కింద పడగానే గొడ్డళ్లు, వేట కొడవళ్లతో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశారు.ఈ సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన పరిధిలో శనివారం అర్ధరాత్రి(ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంటకు) చోటు చేసుకుంది.ఎల్బీనగర్ పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాలకు చెందిన బొడ్డు మహేష్(31) తన తల్లి చంద్రమ్మ, భార్య శ్రావణితో కలిసి ఎల్బీనగర్ ఎన్టీఆర్ నగర్ లో ఉంటున్నాడు. ఇతనిపై పలు పోలీస్ స్టేషన్లల్లో పలు కేసులు ఉన్నాయి.మహేష్ గతంలో ఎన్టీఆర్ నగర్ లో నివాసం ఉండే పగిళ్ల పురుషోత్తం(29)లు మంచి స్నేహితులు.వీరు 2023లో రంగారెడ్డి జిల్లా తట్టిఅన్నారంలో జరిగిన పెళ్లి ఊరేగింపుకు హాజరయ్యారు అక్కడ ఏర్పడిన వివాదం నేపథ్యంలో పురుషోత్తంపై బీరు బాటిల్తో తో మహేష్ దాడి చేశాడు. ఈ సంఘటనలో తలకు గాయాలైన మహేష్ హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు కోర్టులో నడుస్తోంది. అయితే మధ్యలో స్నేహితులని పెట్టి రాజీ కోసం మాట్లాడుకున్నారు. రాజీ పడేందుకు మహేష్ గత 2024 డిసెంబర్ 20 హయత్ నగర్ కోర్టుకు రావాల్సి ఉంది. అతను కోర్టు రాకుండా తాను సూర్యాపేటలో ఉన్నానంటూ కోర్టు కానిస్టేబుల్ కు చెప్పి తనపై దాడి చేసిన అతని స్నేహితుడైన పురుషోత్తంను హత్యకు ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో గత సంవత్సరం డిసెంబర్ 20 వతేదీన కొత్తపేట నాగోలు వెళ్లే రోడ్డులో ఉన్న అమరావతి వైన్స్ వద్ద పురుషోత్తం ఉన్నాడనే పక్కా సమాచరంతో మహేష్ తన స్నేహితులైన బెల్లి భరత్, దాసరి సురేందర్లతో కారు, బైక్లపై వచ్చి పురుషోత్తంపై వేట కొడవలితో దాడి చేయబోగా అతను తప్పించుకున్నారు. ఈ సంఘటనలో దీంతో పురుషోత్తం స్నేహితులైన గడ్డమోయిన రాము, పాశం నాగరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. తప్పించుకున్న పురుషోత్తం దాడి చేసిన విషయంలో చైతన్యపురి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనలో దాడికి పాల్పడిన బొడ్డు మహేష్, బెల్లి భరత్, దాసరి సురేందర్, సుమన్, గౌతమ్ కుమార్, పరుశురాంలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఈ మధ్య కాలంలోనే జైలుకు వెళ్లిన మహేష్ అతని స్నేహితులు జైలు నుండి బయటకు వచ్చారు.అప్పటికే మహేష్ మీద కక్ష పెంచుకున్న పురుషోత్తం అతని స్నేహితులతో కలిసి మహేష్ ను హత్య చేయాలని ప్లాన్ చేసుకున్నారు. గత కొన్ని రోజులుగా పురుషోత్తం మూఠా సభ్యులు మహేష్ కదలికలపై నిఘా పెట్టారు ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి తర్వాత మహేష్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్ పై ఎల్బీనగర్ శివగంగ కాలనీ నుండి ఆర్టీసీ కాలనీకి తన ఇంటివైపు వెళ్తుండగా అప్పటికే మాటు వేసి నిందితులు మహేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టారు.అతను కింద పడి పారిపోయేందుకు ప్రయత్నం చేయగా నిందితులు అప్పటికే తమ వెంట తెచ్చుకున్న గొడ్డళ్ల, వేట కొడవళ్లతో విచక్షణారహితంగా దాడి చేసి అక్కడి నుండి పారిపోయారు.మహేష్ వెంబడి ఉన్న స్నేహితుడు అక్కడ నుండి పారిపోయి స్థానికులకు, ఎల్బీనగర్ పోలీస్ లకు సమాచారం ఇచ్చారు. దాడిలో తీవ్రంగా గాయపడిన మహేష్ ను 108 అంబులైనలెన్స్ ద్వారా కామినేని హాస్పిటల్ కు తరలించారు.అక్కడ డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన మహేష్ తలపై నిందితులు గొడ్డలితో నరడంతో గొడ్డలి తలలో ఇరుక్కు పోయింది. వైద్యులు తీసే ప్రయత్నం చేసిన బయటకురాలేదు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని ఆదివారం పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు. మృతుడి చెల్లెలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.తన కొడుకును హత్య చేయించింది ఆర్కేపురం డివిజన్ కు చెందిన ఓ పార్టీ నాయకుడు అని మహేష్ తల్లి చంద్రమ్మ పోలీస్ స్టేషన్ లో మీడియా ముందు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఎల్బీనగర్ సిఐ వినోద్కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

# వైభవంగా మద్భగవద్గీత పారాయణం




**రంగారెడ్డి జిల్లా, మహా:** తాండూరుకు చెందిన ప్రముఖ రియల్ ఏస్టేట్ వ్యాపారి, శ్రీ సాయిపుత్ర హోమ్స్ అండ్ డెవలపర్సన్ అధినేత బావనోళ్ల శంకర్ యాదవ్ నివాసంలో శ్రీమద్భగవద్గీత అఖండ పారాయణం వైభవంగా జరిగింది. ఆదివారం శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో హిందూ ధార్మిక పరిషత్, గీతాసత్సంగ్ సేవా సమితి సభ్యుల సమక్షంలో శ్రీమద్భగవద్గీత అఖండ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆమనగల్ శ్రీ రామదూత ఆశ్రమం శ్రీ నిత్య శుద్ధానంద స్వామి క్షేత్ర సంస్థాపకులు శ్రీశ్రీశ్రీ శివానంద స్వామి సమక్షంలో మద్భగవద్గీత పారాయణం పఠించారు. శివానంద స్వామి భగవద్గీత పర్వాలను వివరిస్తూ వాటి విశిష్ఠతను తెలిపిన తీరు అందరిని ఆధ్యాత్మిక భావాలను తట్టిలేపింది. గీతా సత్సంగ్ సమితి సభ్యులు కూడా పారాయణం చేయడంతో శంకర్ యాదవ్ నివాసంలో ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంది. అంతకుముందు శంకర్ యాదవ్, చంద్రకళ దంపతులతో పాటు తండ్రి హన్మయ్య, తల్లి, కుటుంబ సభ్యులు అఖండ పారాయణం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం, యజ్ఞాలు నిర్వహించారు. అనంతరం శంకర్ యాదవ్ చేతుల మీదుగా మహాప్రసాద వితరణ చేశారు.

# బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సాయిలాల్ నాయక్

## పార్టీ బలోపేతానికి తన వంతు కృషి
## నా నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కల్వకుర్తి నియోజకవర్గం, కడ్తాల్ మండలం, గోవిందయి పల్లి తాండకు చెందిన బాణావత్ సాయిలాల్ నాయకుని ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమిస్తూ, బిజెపి రాష్ట్ర ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్ నాయక్ నియామకాన్ని ప్రకటించడం జరిగింది. గతంలో సాయిలాల్ ఎస్టి మోర్చా కడ్తాల మండల అధ్యక్షులుగా మరియు ఎస్టి మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేయడం జరిగింది. సాయిలాల్ మాట్లాడుతూ... భారతీయ జనతా పార్టీకి గతంలో నేను చేసిన సేవలను గుర్తించి అధిష్టానం నాకు తెలంగాణ బిజెపి ఎస్టి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాధ్యతను ఇవ్వడం సంతోషకరమని అన్నారు. నన్ను నమ్మి ఈ బాధ్యతలు అప్పగించినందున పార్టీ బలోపేతం కోసం నిరంతరం కష్టపడి పని చేస్తానని, నా నియామకానికి సహకరించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి వర్యులు కిషన్ రెడ్డికి, జాతీయ ఓబిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేసే వ్యక్తి అని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్ రావు అన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన ఆదిలాబాద్ రూరల్ మండల పర్యటనలో భాగంగా మాలే బోరిగామ గ్రామ పంచాయతీ పరిధిలోని కేబి కాలనీని సందర్శించిన సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. తాను ఓడిపోయినప్పటికీ ఆనాడు గ్రామస్తుల కోరిక మేరకు వారికిచ్చిన మాట ప్రకారం కేబీకాలనీలో హనుమాన్ మందిర షెడ్ నిర్మాణం , సిసి రోడ్డు కోసం ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించి 8 లక్షలతో పనులు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారన్నారు.ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేసారు.నిధులు విడుదలలో చొరవ చూపిన కంది శ్రీనివాస రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని ఇచ్చిన మాటకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు.మరికొద్ది రోజుల్లోనే ఉమ్మడి చించుఘాట్ గ్రామ పంచాయతీ పరిధిలో కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తామని తెలిపారు. అంతే కాకుండా ఆదివాసీ యువతకు వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రాజీవ్ యువ వికాసం పథకం కింద మేలు జరిగేలా కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో రూరల్ మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుదగోని సుధాకర్ గౌడ్, గ్రామ పటేల్ మెస్రం నాగోరావ్, దేవరీ మేస్రం గణపతి, గ్రామస్థులు పాల్గొన్నారు.



# పేదలకు వరం సీఎం సహాయ నిధి

## కెఎన్ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** వైద్య సేవల ఖర్చులు భరించలేని నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అందించడం ఒక వరం లాంటిదని కెఎన్ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్ అన్నారు. ఆదివారం ఆమనగల్లు మండలం, మేడిగడ్డతాండ గ్రామ పంచాయతీకి చెందిన నేనావత్ గణేష్ కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ 50,000 చెక్కును బాధితుడికి అందచేశారు. ఈ సందర్భంగా విజయ్ రాథోడ్ మాట్లాడుతూ... పేదలకు వరం సీఎం సహాయ నిధి అని, పేద ప్రజల ఆరోగ్యం గురించి అలోచించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతీ సీఎం సహాయ నిధి చెక్కులు, కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో భాధితులకు స్వల్ప వ్యవధిలోనే అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు,కిషన్, సిద్దు,పవన్,ప్రశాంత్,భాస్కర్,శారదా పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుందాం

## పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏఐసీసీ పిలుపుమేరకు జై బాపు... జై భీమ్... జై సంవిధాన్ పేరుతో ప్రతి గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టాలని కోరుతూ, ఆదివారం రంగారెడ్డి జిల్లా, రాజేంద్ర నగర్ లోని గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన, జిల్లా పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు, నేతలకు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ....భారతదేశం నేడు విపత్కర పరిస్థితి ఎదుర్కొంటుందని పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి రాజ్యాంగాన్ని అవమానిస్తూ రాజ్యాంగ స్పూర్తిని దెబ్బతీస్తూ మోడీ మార్క్ పాలన సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ, గౌరవిస్తూ పాలించాల్సిన పాలకులు నేడు వ్యవస్థలను నాశనం చేస్తూ తమ ఆధీనంలోకి తీసుకొని ప్రజాస్వామ్య స్పూర్తిని కాలరాస్తున్నారని మండిపడ్డారు. దేశ ప్రజలకు సమాన హక్కులు, సమాన స్వేచ్ఛ, సమన్యాయం కల్పిస్తూ రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కాలరాస్తూ నేటి బిజెపి ప్రభుత్వ తీరు తీవ్ర అక్షేపనీయంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను హరిస్తూ కట్టు బొట్టు, తిండి, పూజపై ఆంక్షలు విదిస్తూ ప్రజల హక్కులకు భంగం కలిగిస్తున్నారని తెలిపారు. ఇలాంటి తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడు పై ఉందని స్పష్టం చేశారు. మనకు అహింస, శాంతి, సిద్ధాంతాలను అలవరించిన మహాత్ముని స్మరించుకుంటూ, రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుందాం అని అందుకే జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ నినాదంతో




ఉద్యమిద్దామని, బిజెపి తీరును పెద్దయెత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులతో ప్రతిజ్ఞ చేపించారు.

**సంచలన వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి...**

రాజేంద్రనగర్ లో జరిగిన జిల్లా సమావేశంలో, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ...జిల్లా మంత్రి పదవి కొరకు కులమే అడ్డు అనుకుంటే రాజీనామా కైనా సిద్ధం అని సంచలన వ్యాఖ్యలు చేయడం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికి 18 నెలలు గడుస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఎంతో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీ పదవులు నామినేట్ పదవులు రాక ఆందోళన చెందుతున్నారన్నారు. రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి కావాలని మంత్రి పదవి లేకుంటే లోకల్ బాడీ ఎన్నికల్లో ఇబ్బందులు కలుగుతాయి అని ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా హైదరాబాదుకు గుండెకాయ లాంటి రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు మంత్రి పదవి లేకపోవడం కూడా నిరుత్సాహానికి గురిచేసిందన్నారు. జిల్లాలో ఏ సమస్య ఉన్న మంత్రికి చెప్పాలంటే మంత్రి పదవి లేదన్నారు. రంగారెడ్డి జిల్లాలో మంత్రి పదవి కొరకు తాను రాజీనామా చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నానని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఏకైక కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేగా గెలిచిన నేను తనకు మంత్రి పదవి ఇవ్వాలని అందరూ కోరుకుంటున్నారన్నారు. అగ్రవర్ణాలకు మంత్రి పదవి రాదంటే తాను రాజీనామా చేసి ఇంకొకరిని ఎన్నికల్లో పోటీ చేహించి గెలిపించడానికి సిద్ధమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి ఒక్కరికి అండగా ఉండి వారిని సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, జడ్పిటిసిలుగా గెలిపించుకోవడానికి వెన్నుదండిగా ఉండి కృషి చేస్తానన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆలోచించి రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి సభ్యులు చల్లా వంశీచంద్ రెడ్డి, షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, మున్సిపాలిటీల ముఖ్య నాయకులు పాల్గొనడం జరిగింది.

# పార్టీ ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం

## మరోసారి స్పీకర్ కు సుప్రీంకోర్టు నోటీసులు
## 25న విచారణ

**మహా :** ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపుల కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో భాగంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు సుప్రీంకోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది. గతంలో ఈ నెల 22లోగా స్పందించాలని ఇచ్చిన నోటీసులపై స్పీకర్ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో కోర్టు మరోసారి నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. పార్టీ ఫిరాయింపుల అంశంపై ఈ నెల 25న సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. గతంలో ప్రభుత్వానికి, అసెంబ్లీ కార్యదర్శికి, 10 మంది ఎమ్మెల్యేలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. బీఆర్ఎస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్ పై ఈ నెల 22 లోపు సమాధానం ఇవ్వాలని నోటీసులు పంపించగా నిర్ణీత గడువు ముగియడం వల్ల కోర్టు మరోసారి నోటీసులను జారి చేసింది. తెలంగాణలో ఇటీవల చోటుచేసుకున్న ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలుగా గెలిచిన 10 మంది కాంగ్రెస్ లో చేరారు. ఈ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఈ అంశం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు సమయం ఇవ్వాలని కాంగ్రెస్ కోరుతుండగా.. ఈ కేసుపై న్యాయస్థానాల తీర్పులను గౌరవిస్తామని బీజేపీ స్పష్టం చేసింది. ఈ కేసులో సర్వోన్నత న్యాయస్థానంలో తుది నిర్ణయం ఎలా వస్తుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

# ముస్లింల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

## ఘనంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు.. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ముస్లిం సోదరుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక తాండూరు శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సంధర్బంగా ఆదివారం ముస్లిం సోదరులకు, ప్రభుత్వ అధికారులు తాండూరు పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్ లోఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరై, ముస్లిం సోదరులతో కలిసి ఇస్తారు విందు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని కొనియాడారు. అనంతరం ముస్లిం సోదరులతో సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు. ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, తాండూరు నియోజకవర్గ ముస్లిం సోదరులు, మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందుకు విజయశాంతి

**మహా:** పటాన్ చెరు నియోజకవర్గం, రామచంద్రపురం మండల కేంద్రంలో అబ్దుల్ ఘని నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ విజయశాంతి పాల్గొన్నారు. మతసామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత గాలి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# విజయ పాలడెయిరీ ఎండీని కలిసిన పాడి రైతులు

## పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

రైతుల సమస్యలు పరిష్కరించాలి.. ఆమనగల్ పాడి రైతులు, నాయకులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పెండింగ్ పాల బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాడి రైతులు తెలంగాణ విజయ పాల డెయిరీ చెర్మన్ గుత్తా అమిత్ రెడ్డిని ఆదివారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కలవడం జరిగింది. ఆమనగల్ మండల కేంద్రానికి చెందిన నాయకులు, పాడి రైతులు పెండింగ్ బిల్లుల చెల్లింపులతో పాటు సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని చైర్మన్ ను కోరడం జరిగింది. వారం రోజుల్లో రెండు బిల్లులు విడుదల చేస్తామని విజయ డైరీ చైర్మన్ హామీ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ వైస్ చెర్మన్ భాస్కర్ రెడ్డి, కడ్తాల్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచ్య నాయక్, ఆమనగల్ మండల అధ్యక్షులు తెల్లమల్ల జగన్, తలకొండ పల్లి మండల అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, కల్వకుర్తి యూత్ ఉపాధ్యక్షులు షాబుద్దీన్, రమేష్, వెంకట్ రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్ చట్టాలను కాంగ్రెస్సే చేసింది

- కాంగ్రెస్ పాలిత మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు వస్తే బీజేపీకే అధికారం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**మహా:** ఇప్పటివరకు డీలిమిటేషన్‌పై ఉన్న చట్టాలు చేసింది కాంగ్రెస్సే అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దక్షిణాది రాష్ట్రాలకు ఏదో జరిగిపోతోందని ప్రచారం చేయడం సరికాదన్నారు. డీలిమిటేషన్‌పై రేవంత్‌రెడ్డి, కేటీఆర్ కలిసి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ''ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంపై దృష్టి పెట్టాలి, కానీ దురదృష్టవశాత్తు మన పాలకులు లేని అంశాన్ని భూతద్దంలో చూపిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. శనివారం చెన్నై లో జరిగిన సదస్సులో ప్రాంతీయ పార్టీల స్వప్రయోజనాలే కనిపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ అధికారం కోసం తహతహలాడుతోందన్న విషయం తేటతెల్లమైందన్నారు. దేశంలో లేని సమస్యను సృష్టించి, బీజేపీ, కేంద్రానికి వ్యతిరేకంగా సమావేశం నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. చెన్నై సదస్సు ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్ భారాస పాత బంధం బయటపడిందన్నారు. డీలిమిటేషన్ విధివిధానాలపై ఇంకా చర్చనే జరగలేదన్నారు. దానిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు, దక్షిణాది ప్రజలకు అన్యాయం జరుగుతుందని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమిళనాడులో కుటుంబ, కుంభకోణం పాలన జరుగుతోందని, దక్షిణాది ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

# ఆర్థిక సంక్షోభంలోను అభివృద్ధి బాట



## ప్రతి పేదోడి సొంతింటి కల నెరవేరే సమయం

తాండూరు ప్రాంతానికి 3500 ఇండ్ల మంజూరు..సమిష్టి నిర్ణయాలతో భ్ధిదారుల ఎంపిక

ఉచిత ప్రయాణాలు చేస్తున్న మహిళలే! నేడు బస్సులకు యజమానులు

తాండూరు రహదారులకు రాజమార్గం..ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణంతో మెరుగైన విద్య

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నా అభివృద్ధి పథంలో ప్రభుత్వం పయనిస్తుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా, తాండూరు పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్ లో నియోజకవర్గ పరిధి ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనేదే సీఎం లక్ష్యమని ప్రతి పేదోడికి సొంతింటి కల నెరవేరే సమయమని ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. తాండూరు అసెంబ్లీ పరిధిలో మండలానికి ఒక గ్రామం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే విధంగా చూడాలని కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, నాయకుల సమిష్టి నిర్ణయాలు తీసుకొని అర్హులను ఎంపిక చేయాలని,ప్రజల కోసం పని చేస్తూ పార్టీ బలోపేతానికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం చేసే సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధిపై గ్రామాలలో చర్చించి వాస్తవాలు ప్రజలకు చేరవేసే బాధ్యత కమిటీ సభ్యులదే అని అన్నారు.దేశంలో ఏ రాష్ట్రంలో చేయని అభివృద్ధి కార్యక్రమాలు మన రాష్ట్రంలో మన ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్విరామంగా కొనసాగించేందుకు కృషి చేస్తుందని ఓవైపు ఆర్థిక భారం ఉన్నా దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రైతులకు 21 వేల కోట్ల రూ"ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. గత ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ గాడితప్పి పాలన చిన్నాభిన్నమై ఏ వర్గాన్ని సంతృప్తి పర్చలేదని, మన ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కులాల వారిగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి బడ్జెట్లో నిధులు కూడా కేటాయించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లన్ నిధులు పూర్తిగా దుర్వినియోగమైందని మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంబడే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పకడ్బందిగా అమలు చేశామన్నారు. ప్రజా ప్రభుత్వంలో స్వయం సహాయక సంఘాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు, బ్యాంకు లింకేజీ శ్రీనిధి ద్వారా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి మహిళలను కోటీశ్వరులను చేసే విధంగా మన ప్రజా ప్రభుత్వం రుచి చేస్తుందని పేర్కొన్నారు.

మహిళలు కేవలం బస్సులో ఉచితంగా ప్రయాణించడమే కాదు మహిళలే బస్సులు నడిపే విధంగా వారికి రుణాలు ఇచ్చి బస్సులు కొనుగోలు చేయించి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యేకంగా కృషి చేసిందని, అలాగే రూ.500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అందిస్తూ కట్టెల పొయ్యి నుండి మహిళలకు విముక్తి కలిగించినట్లు చెప్పారు. మన ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారమే తెలంగాణలో ప్రజా ప్రభుత్వం, సంవత్సర కాలంలోనే సమగ్ర కులగణన పూర్తి చేస్తూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ ద్వారా అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం అందించే దిశగా అడుగులు వేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో నిరుద్యోగులు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ధర్నాలు చేసేవారని కానీ మన ప్రభుత్వంలో నోటిఫికేషన్లు వచ్చాక ప్రిపరేషన్ కు సమయం ఇవ్వాల్సిందిగా ధర్నాలు చేస్తున్నారంటే నిరుద్యోగులపై మన ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రంలో ఉన్న 55 వేల మంది పైగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాలలో సంతోషాన్ని నింపిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను కొనియాడారు. మన తాండూరు అభివృద్ధి విషయానికి వస్తే అన్ని మండల కేంద్రాల నుంచి నియోజవర్గ కేంద్రానికి నాలుగు లైన్ల రహదారులు మంజూరు అయ్యాయని నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి, తండాకు రహదారుల నిర్మాణం రానున్న రెండు సం"లలో పూర్తిస్థాయిలో రహదారుల సమస్యలకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఎన్నడు లేని విధంగా గ్రామాలలో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి అధిక మొత్తంలో నిధులు తెచ్చి నాణ్యమైన పనులు చేసే విధంగా అధికారులకు, నాయకులకు సూచించినట్లు తెలిపారు. ఈ ప్రాంతం బాగుపడాలంటే ఇక్కడ విద్యావ్యవస్థ అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో తాండూర్ నియోజకవర్గానికి 200 కోట్ల రూ"లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని భవిష్యత్తులో విద్యా నిలయంగా మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు.